
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 08.04.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com


# చరిత్రను మరచిన చంద్రం



- ఏ పార్టీని ఎవ్వరూ నిర్వీర్యం చేయలేరు
- రాష్ట్రంలో 'దేశం' ఆడుతున్నది డేంజర్ గేమ్
- స్వీయ తప్పిదాలే పార్టీ పతనానికి మార్గాలు
- ఈ విషసంస్కృతి ప్రజాస్వామ్యానికే ప్రమాదం

**మహేష్‌బాబు హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన సూపర్‌డూపర్ హిట్ చిత్రంలో ఓ డైలాగ్ వుంది. 'బాచిరెడ్డి... శివారెడ్డి చనిపోతే నువ్వు సీఎం అవుతావ్... శివారెడ్డిని చంపితే హంత కుడివి అవుతావ్.. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్స య్యావు...' అనే డైలాగ్‌ను విలన్ కోట శ్రీనివాస రావునుద్దేశించి సిబిఐ ఆఫీసర్ ప్రకాష్‌రాజ్ అం టాడు. ఈ డైలాగ్ ఇప్పటికీ పాపులరే... ఆ డైలాగ్‌లో చాలా లాజిక్ వుంది. సీఎంకు హంతకుడికి మధ్య చిన్నపాటి వ్యత్యాసాన్ని ఆ డైలాగ్ సూచిస్తుంది.**

ఇప్పటి రాష్ట్ర రాకీయాల్లో చంద్రబాబుకు ఆ డైలాగ్ వర్తిస్తుంది. ఇతర పార్టీల నుండి ఎమ్మెల్యేలు వచ్చి చేరితే ఆయన ప్రజానాయకుడవుతాడు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటే ఆయన ఫిరా యింపుదారుల అధిపతి అవుతాడు. ఈ లాజిక్కే ఆయన మిస్సవుతున్నాడు. భూమా నాగిరెడ్డి... దేవగుడి ఆదినారాయణరెడ్డి... డేవిడ్ రాజు... జయరాములు... మణిగాంధీ... జ్యోతుల నెహ్రూ... పరుపుల రామారావు.. పాశం సునీల్... వీళ్లెవరు కూడా వాళ్లంతటవాళ్లు వైకాపాను వీడి తెలుగు దేశంలో చేరినవాళ్లు కాదు. తెలుగుదేశం నుండి వచ్చిన ఆఫర్స్‌కు తలొగ్గిన వాళ్లే! వైకాపా ఎమ్మెల్యేలు ఎందుకోసం పార్టీ మారుతున్నారో తెలుసుకోలేనంత అమాయక స్థితిలో ప్రజలు లేరు. వైకాపా నుండి వస్తున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలందరు కూడా తన బలం అని చంద్రబాబు అనుకుంటే అంతకు మించిన అమాయకత్వం లేదు. పరాయి పార్టీ ఇమేజ్‌తో గెలిచి తన పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు ఆయనకు మైనస్సే గాని ప్లస్ కాలేరు.

పార్టీ అధినాయకుడితో పడక ఒకరిద్దరు ఎమ్మెల్యేలొచ్చి తెలుగుదేశంలో చేరారంటే అర్ధముంది. కాని పదిమంది ఎమ్మెల్యేలు ఎలాంటి ప్రలోభాలు, ప్రయో జనాలు లేకుండా పార్టీ ఎందుకు మారుతారు? జగన్ విధానాలు నచ్చకే పార్టీ మారుతున్నామని పలువురు ఎమ్మెల్యేలు చెబుతున్నారు. రేపు చంద్రబాబు విధానాలు మాత్రం వీరికి నచ్చుతాయనే గ్యారంటీ ఏమిటి? రేపు చంద్రబాబు అధికారంలో లేకుంటే ఖచ్చితంగా ఆయన విధానాలు కూడా సరిపడకపోవచ్చు.

వైకాపా నుండి ఎంతమంది ఎమ్మెల్యేలను లాక్కుంటే తమ పార్టీ అంత బలపడుతుందని, వైకాపా అంతగా నీరసపడుతుందని చంద్రబాబు లాంటి రాజకీయ మేధావులు ఆలోచిస్తే మాత్రం పప్పులో కాలేసినట్లే! ఇప్పుడు వైకాపాను వదిలిన 10మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉపఎన్ని కలకు పోతే వారిలో ఎంతమంది గెలవగలరో చెప్పే పరిస్థితి కూడా లేదు. పార్టీ మారిన వారిలో ఒకరిద్ద రికి తప్ప సొంతవర్గం, సొంత జనం, సొంతంగా గెలవగల బలం లేదు. ఒకవేళ రాజ్యసభ ఎన్నికల కోసం ఎమ్మెల్యేలను లాక్కుంటున్నారని అనుకున్నా, మహా అంటే ఒక రాజ్యసభ సీటు అదనంగా వస్తుందేమో! దాని కోసం ఇంత అప్రదిష్ట మూట గట్టుకోవాల్సిన అవసరముందా?

(మిగతా 11వ పేజీలో)






నెల్లూరు జిల్లాలో తొలిబోణి

# దేశంలోకి పాశం

**చంద్రబాబు ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్ నెల్లూరుజిల్లా వైసిపిని కూడా తాకింది. ఇంతవరకు కర్నూలు, కడప, ప్రకాశం, కృష్ణ, తూర్పుగోదావరి జిల్లాల్లో మాత్రమే ఈ ప్రయోగం సక్సెస్ అయ్యిందని, నెల్లూరుజిల్లా వైకాపా ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా జగన్ వెంటే వున్నారని, విశ్వాసానికి మారుపేరు నెల్లూరుజిల్లా ఎమ్మెల్యే లని కితాబులిచ్చారు. అయితే ఇప్పుడు ఫిరాయింపుదారుల జాబితాలోకి నెల్లూరుజిల్లా కూడా చేరిపోయింది.**

వైకాపాకు సంబంధించి నెల్లూరు నుండి తొలి చేపగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను తెలుగుదేశం నాయకులు ఎరేసి పట్టారు. రెండువారాల క్రితమే "పాశంకు దేశం వల" అని 'లాయర్' ప్రచురించింది. ఆ వలలో పాశం పడిపోయాడు. సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ గంగాప్రసాద్ ఈ ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషించాడు. ఇక జిల్లా మంత్రి పి.నారాయణ తెరపై పాత్రను పోషించాడు. పాశం సునీల్ వైకాపాను వదిలి తెలుగుదేశంలో చేరడం వెనుక పెద్దకారణాలేమీ లేవు. ఇంతవరకు వైకాపాను వదిలిన ఎమ్మెల్యేలంతా ఏ కారణం, ఏ ఆశావాదంతో అయితే తెలుగుదేశంలో చేరారో ఈయన కూడా అదే కారణాలతో చేరాడు. జిల్లాలో మొదటి నుండి పాశం సునీల్‌పైనే

(మిగతా 11వ పేజీలో)

# 'లోక్' నాయకుడా?

- మంత్రి పదవి పిలుస్తుంది.. రా.. కదలిరా...



**మన బిడ్డను మనం పొగుడుకుంటే పుత్ర వాత్సల్యం అంటారు. అదే ఎదుటివారు పొగిడితే ప్రతిభకు గుర్తింపంటారు. రాజరికంలో ఎదుటివారు అంగీకరించినా, అంగీకరించకపోయినా యువరాజులకు పట్టాభిషేకం జరిగిపోతుంది. కాని ప్రజాస్వామ్యంలో అలాకాదు. యువరాజుల ప్రతిభను ఇతరులు గుర్తించాలి. ఆ యువరాజును మాకు మహారాజుగా నియమించండి ప్రభో... అని ఆస్థాన దిగ్గజాలే వేడుకోవాలి. అప్పుడు ప్రజల కోరిక మేరకు మహారాజుగారే దిగొచ్చి యువరాజుకు పట్టాభిషేకం చేస్తాడు. అప్పుడు సింహాసనంపై తన పుత్రుడిని చూసుకోవాలనుకున్న మహారాజు ముచ్చట తీరుతుంది. మహారాజు మనసులోని కోరికను తాము తీర్చిగలిగామనే ఆనందం ఆస్థాన దిగ్గజాలకు దక్కుతుంది.**

2014ఎన్నికలకు ముందు.. కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌ను కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ చించిపడేసాడు. ఆ సీన్ చూసిన కాంగ్రెస్ నాయకుల కళ్లలో ఆనందభాష్పాలు వరదలు కట్టాయి. యువరాజులో పూర్తి పరిపక్వత వచ్చింది, ఇంతకంటే మేధాసంపన్నులు ఈ దేశంలో ఇంకెవరున్నారు, ఈ దేశ ప్రధాని కావడానికి ఇంతకంటే అర్హతలు ఏం కావాలి, ఇకనన్నా రాహుల్‌ను భావిప్రధానిగా పార్టీని, మమ్మల్ని ఉద్ధరించే నేతగా ప్రకటించడండని కాంగ్రెస్ నేతలు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేయడంతో సోనియాగాంధీ దిగొచ్చి వారి

(మిగతా 11వ పేజీలో)

# అవినీతితో పెనవేసుకున్న బంధం

• ఏసిబికి పట్టుబడ్డ సబ్‌రిజిస్ట్రార్ నందకిషోర్

ఓ వేశ్యను కొందరు ప్రజలు రాళ్లతో కొడుతుంటే... ఏసుప్రభువు కలుగజేసుకుని... మీలో పాపి కానివాళ్లు మాత్రమే ఆమె మీద రాళ్లు వేయమన్నాడట... ఆ మాటతో ఒక్క రాయి కూడా ఆమె మీద పడలేదు. కాబట్టి లోకంలో చాలావరకు అందరూ పాపులే! కాకపోతే చేసిన పాపాల పద్దుల్లో అటు ఇటుగా కొంచెం తేడా ఉంటుంది. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగుల పరిస్థితి కూడా అంతే! ఇక్కడ నిజాయితీపరులను వెదికి పట్టడం చాలా కష్టం. అలా అని అలాంటి అమాయకులు లేరా... అంటే అదేమీ కాదు. ఖచ్చితంగా అక్కడక్కడా ఉండే వుంటారు... చేతగాని వాళ్లంటూ ఇంటా, ఆఫీసులో అందరి ప్రశంసలందుకుంటూ...

నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ వై.కె.నందకిషోర్‌పై ఏసిబి దాడి జరిగింది. ఏక కాలంలో నెల్లూరు, కావలిలోని ఆయన ఇళ్లు, ఆయన బినామీల ఇళ్లపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏకకాలంలో దాడులు జరిపి సోదాలు నిర్వహించారు. మార్కెట్ విలువ ప్రకారం దాదాపు 50కోట్ల విలువచేసే ఆస్తులు బయటపడ్డట్లు సమాచారం. కావలికి చెందిన నందకిషోర్ వాటర్‌బాయ్‌గా రిజిస్ట్రేషన్ శాఖలో చేరి సబ్‌రిజిస్ట్రార్ స్థాయికి ఎదిగాడు. సబ్‌రిజిస్ట్రార్‌గా పలు చోట్ల పని చేశాడు. పని చేసిన ప్రతిచోటా అవినీతి ఆరోపణలు ఎక్కువగానే వున్నాయి.

అయితే రిజిస్ట్రేషన్ శాఖలో ఒకరిద్దరిని పట్టినంత మాత్రాన ఈ శాఖలో వేళ్లూనుకున్న అవినీతి దారికి రాదు. ప్రతి శాఖలోనూ అవినీతి వటవృక్షం బలంగా వుంది. ఏసిబి వాళ్లు కొన్ని అవినీతి కొమ్మలను కత్తిరించగలరే గాని, ఈ చెట్టును కూల్చలేరు కదా!



# ప్లాస్టిక్ వాడొద్దు... ఆవులను చంపొద్దు!

ప్లాస్టిక్ క్యారీబ్యాగులు ఎంత ప్రమాదకరమో మీడియా సంస్థలు అదేపనిగా చెబుతున్నా, జనం వాటి వాడకాన్ని మాత్రం తగ్గించడం లేదు. మన ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికే కాక మనుషులు, పశువుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతోంది. మొన్ననే పొదలకూరులో ఓ ఆవు కడుపులో వున్న 20కిలోల ప్లాస్టిక్ కవర్లను శస్త్రచికిత్స చేసి బయటకు తీసారు వైద్యులు. అవి మూగజీవాలు, రోడ్ల మీద ఆకులను తింటుంటాయి. రోడ్ల మీద విసిరేసే చెత్తలో అధికభాగం ప్లాస్టిక్ వ్యర్థాలే వుంటున్నాయి. ప్లాస్టిక్‌తో వచ్చే నష్టం గురించి తెలిసిన మనుషులే వాటి వాడకాన్ని ఆపడం లేదు. ఇక ఏ జ్ఞానం లేని పశువులకేం తెలుసు... వాటిని తిన కూడదని. ఇతర వ్యర్థాలతో కలిసిపోయిన ప్లాస్టిక్ కవర్లను తినేస్తూ పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. గతంలోనూ నాయుడుపేటలో ఓ ఆవు ప్లాస్టిక్ వ్యర్థాలను తిని ప్రాణాలు కోల్పోయింది.

ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న పశువులు అప్పుడప్పుడు ప్రాణాలకు ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటుండగా, అదే ప్లాస్టిక్‌ను వాడుతున్న మనుషులు క్రమక్రమంగా ముప్పును తెచ్చుకుంటున్నారు. ఈరోజు మనిషి సాధారణ జీవితంలో ప్లాస్టిక్ కవర్‌లు ఓ భాగమైపోయాయి. కూరగాయలు, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలంటే ప్లాస్టిక్ కవర్లు... వేడి వేడి టిఫిన్, సాంబర్ వంటివి ప్లాస్టిక్ కవర్లలోనే ప్యాకింగ్... చికెన్ మసాలా, మటన్ బిరియాని, కర్రీస్... అన్నీ ప్లాస్టిక్ కవర్లలోనే ప్యాకింగ్, హాట్ డ్రింకైనా, కూల్‌డ్రింకైనా ప్లాస్టిక్ కప్పుల్లోనే... ఆ నీళ్లకి ప్లాస్టిక్ కరిగి మన శరీరంలోకే పోతుందన్న విషయం అందరికీ తెలుసో తెలియదో కాని, ఈ ప్లాస్టిక్ వాడకం మనిషి ఆరోగ్యంతో ఆడుకుంటుందన్నది మాత్రం ముమ్మాటికీ వాస్తవం.

# దుర్ముఖీ నీకు స్వాగతం



చిన్ని నారాయణరావు
94402 02942

దుర్ముఖి –
ఏ ముఖం పెట్టుకొని వచ్చావ్
అసలే ఆశలు మోడులై
జీవచ్ఛవాల్లో బ్రతుకు కుంపట్లో
చలికాచుకొంటున్నాం
ఇప్పుడా మా మీద యుద్ధోన్మాద
ప్రతాపం
అయితేనేం దుర్ముఖి –
నీ అడుగుజాడల్లో స్వర్ణాలను
పండించగల సత్తా మాకుంది
పచ్చ పచ్చటి వరిపైరులతో
స్వర్గాలను సృష్టించుకోగల నేర్పు మాకుంది
ఆదాయాల్లో అల్పత్వానికి
బ్యాంకులు బైబై చెప్పిన
పారదర్శకత మా ప్రత్యేకత
నకిలీలపై సమరం సాగించి
డిజిటల్ సూర్యోదయాన్ని
ప్రభవించే నవనవోన్మేషమ్మే మా భావుకత
అంకుర పారిశ్రామికాభివృద్ధితో
నవ్యత్వం నింగికెగసి పతాకయైన వేళ
ప్రగతిదారుల పొద్దుపొడుపు
క్రాంతి దర్శినియైన హేల
ఇంటింటా విద్యుత్ సౌరభాలు
వెదజల్లే ఉషఃకాంతి సమీకరమ్మిది
అవినీతి 'డెబిట్ల' కళ్లు పొడిచి
ఆ జమానాలను
పెకిలించే అరుణారుణమిది
జంతుబలిని నిర్మూలిస్తూ
ప్రయోగశాలలో మాంసాన్ని
తయారుచేయగల భారతీయుని
సాక్షిగా చెబుతున్నా –
తలలేకపోయినా
తలపులున్న వాణ్ణి... తలపడగలవాణ్ణి!
శత్రు దుర్భేధ్యంగా నా దేశాన్ని
రక్షించగల జవసత్వాలున్నవాణ్ణి
కొత్త సంవత్సరానికి రాజెవ్వరైనా
దూసుకుపోగల నిర్భీకత మాది
మంత్రెవ్వరైతేనేం వెలుగుల
సంప్రోక్షణలు మావి
మనిషిని కార్యోన్ముఖుణ్ణి చేసే
కోటి ఆశల ఉగాది ఇది
స్వాగతం దుర్ముఖి నీకు
ఘన స్వాగతం

# 9న 'నెరసం' ఉగాది పురస్కారాలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు టౌన్‌హాల్ ఆవరణలోని ఏసి హాల్‌లో పలువురు కవులకు ఉగాది ఆత్మీయ పురస్కారాలను అందజేయనున్నట్లు నెరసం అధ్యక్ష కార్యదర్శులు ఏ. జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావుకు నెరసం ఉగాది పురస్కారం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెసి ఆర్‌వెస్ రాజ్‌కుమార్, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, డా.ఎస్‌ఆర్‌కె స్కూల్ అధినేత గురుబ్రహ్మ పి.కృష్ణమూర్తి, నెరసం గౌరవాధ్యక్షులు డాక్టర్ పమిడి శ్రీనివాసతేజ ముఖ్య అతిధులుగా పాల్గొంటారని వారు తెలిపారు. తొలుత, ఉదయం 9 గంటలకు కవిసమ్మేళనం ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు, మాటేటి రత్నప్రసాద్, బాలసాహిత్యవేత్త డా.గంగిశెట్టి శివకుమార్, ట్రాఫిక్ సిఐ ఎన్.రామారావు, బాలభవన్ డైరెక్టర్ శ్రీమతి గోవిందరాజుల సుభద్రాదేవికి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీమతి జె.బాలార్కకు ఉగాది ఆత్మీయ పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రముఖ సేవా, విద్యాసంస్థ భారతీయ విద్యావికాస్ (ఇంగ్లీష్ మీడియం) హైస్కూల్ (వాత్సల్య)కు, యునెస్కో చిత్రలేఖనం అవార్డ్ గ్రహీత చిరంజీవి అనిమేష్ మండలకు ప్రత్యేక పురస్కారాలు అందజేస్తామన్నారు. సభకు నెరసం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహిస్తారని, కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ సభా నిర్వహణ కార్యక్రమాలు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.

## శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో
# 12న భరద్వాజ ఆరాధన



అనేక రాష్ట్రాల్లో శ్రీ సాయి తత్వాన్ని ప్రచారం చేసి, అనేక సత్సంగాలు నిర్వహించి, పలు సంస్థలను మందిరాలను స్థాపించి ప్రజలను భక్తిమార్గంలో పయనింపజేసిన మహనీయుడు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్ ఆరాధన మహోత్సవం ఈ నెల 12వ తేదిన ఘనంగా నిర్వహిస్తామని శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరం నిర్వాహకులు తెలియజేశారు. శ్రీ సాయి లీలలను సేకరించి శ్రీ సాయిలీలామృతంగా.. పారాయణగ్రంథంగా అందించి, దత్త సంప్రదాయాన్ని, అవధూత సంప్రదాయాన్ని భక్తులకు అందించిన మహనీయుడు పూజ్యశ్రీ భరద్వాజ అని వారు పేర్కొన్నారు. స్థానిక కొండాయపాళెం గేటు వద్ద వున్న రవీంద్రనగర్ 2వ వీధిలో వున్న శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో ఆ రోజున ఉదయం 8 గంటలకు శ్రీ సాయినాథునికి అభిషేకం, 10.30 గంటలకు సామూహిక పూజ, 12 గంటకు హారతి నిర్వహిస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని, నాగారెడ్డి ఉదయభాస్కర రెడ్డి–శ్రీమతి ఇందిర ఉభయకర్తృత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా ఈ నెల 15న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ మందిరంలో వేడుకలు జరుగుతాయన్నారు. ఆ రోజున ఉదయం 9 గంటలకు శ్రీ సీతారామ కళ్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసంతర్పణ, రాత్రి 7 గంటలకు గంధ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. శ్రీ సీతారాముల కళ్యాణానికి జె.సుధాకరరావు, శ్రీమతి రమాదేవి ఉభయకర్తలుగా, అన్నసంతర్పణకు ఆర్.శ్రీనివాసరాజు–శ్రీమతి సుమతి (యుఎస్ఏ), చిరంజీవి శ్రీయన్‌లు శాశ్వత ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## శ్రీ సాయి మందిరాలలో
# ఉగాది, శ్రీరామనవమి మహోత్సవాలు

నెల్లూరు బాలాజీనగర్ చివరన పద్మావతి నగర్‌లో వున్న శ్రీసాయి దర్బార్ అద్దాల మందిరంలో ఈ నెల 7 నుండి 16వ తేదీ వరకు ఉగాది, శ్రీరామనవమి మహోత్సవాలు, అఖండ శ్రీసాయి నామసంకీర్తన సప్తాహ మహాయజ్ఞం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మధుసాయి తెలిపారు. 7వ తేదీ నుండి 14వ తేదీ ఉదయం 6గంటల వరకు అఖండ సాయి నామ సంకీర్తన సప్తాహ మహాయజ్ఞం జరుగుతుందన్నారు. 15వ తేదీ శ్రీరామనవమి రోజు ఉదయం 9గంటలకు సీతారామ కళ్యాణం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి విష్ణుసహస్రనామ పారాయణం జరుగుతాయన్నారు. రాత్రి షిరిడి సంప్రదాయం ప్రకారం బాబా గంధ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు సాయి సచ్చరిత పారాయణం జరుగుతుందని తెలిపారు. 10వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

అదే విధంగా నెల్లూరు ట్రంకురోడ్డులోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో ఈ నెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు శ్రీ సాయిబాబా జన్మదిన శ్రీరామనవమి మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. స్వామివారికి ప్రతిరోజూ మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 7గంటలకు సాంస్కృతిక మందిరం నందు ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# మద్దతు ధర ఇవ్వండి

వరికి మద్దతు ధర కల్పించి నెల్లూరుజిల్లా రైతులను ఆదుకోవాలని జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావును కలిసి విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, బీజేపీ నాయకులు ఎం.శ్రీనివాసులు, వెంకరెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు 3వ తేదీన చిలకలూరిపేటలో మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో వరి దిగుబడి తగ్గగా నెల్లూరుజిల్లాలో అధికంగా ఉందని, మార్కెట్ యార్డ్‌లలో కొనుగోలు కేంద్రాలను పెంచాలని, 4శాతం వ్యాట్‌ను ఎత్తేయాలని వారు మంత్రిని కోరారు. పుట్టి బిపిటి ధర 12వేలకు పడిపోయిందని, గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని వారు మంత్రిని కోరారు.

# విద్యార్థుల కేరింతలు

ఈ నెల 4వ తేదీతో పదో తరగతి పరీక్షలు ముగిసాయి. మార్చి 21 నుండి టెన్త్ పరీక్షలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని సెంటర్‌లలోనూ పరీక్షలు ప్రశాంతంగానే జరిగాయి. పలుచోట్ల మాస్ కాపీయింగ్ జరిగిన ఆరోపణలున్నాయి. 4వ తేదీ పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు రోడ్ల మీద కేరింతలు కొడుతూ సంతోషంగా ఇళ్లకు వెళ్లారు.

# రైతులను కష్టపెట్టకండి



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ సహించేది లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కొత్తవెల్లంటి జడ్పీ ఉన్నతపాఠశాల సమీపంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ కష్టాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయశాఖ అధికారులు తేమ శాతాన్ని నిర్ధారించినా మిల్లర్లు మాత్రం తేమ ఎక్కువగా వుందంటూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే నేరుగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఎస్ఓలతో ఫోన్‌లో రైతుల కష్టాలను వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఎంతో నష్టపోతున్నారని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రవాణా చేసుకునేందుకు ప్రభుత్వమే వాహనాలను సమకూర్చాలని కోరారు. వాహనాలు సమకూర్చకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గోల్డ్‌మెడల్ సాధించిన మైథిలి పూర్వవిద్యార్థిని



నెల్లూరు చౌంద్రమౌళినగర్‌లోని మైథిలి ఇంగ్లీషు మీడియం స్కూల్ పూర్వవిద్యార్థిని బి.వెంకటసుష్మ మెడిసిన్‌లో 4బంగారు పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఈ నెల 6వ తేదీన మైథిలి స్కూల్ ఆవరణంలో ఆమెకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట సుష్మ మాట్లాడుతూ డబ్బు, తెలివికంటే కూడా కష్ట పడే తత్వం విజయాలను అందిస్తుందని చెప్పారు. చదువులేని తల్లిదండ్రులు, చదివించే స్థోమత లేని కుటుంబం నుండి వచ్చిన తనను, తన చెల్లెలు ఉషాభవానిని ఎంతగానో ప్రోత్సహించిన శ్రీమతి మైథిలికి, మనోహర్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీమతి మైథిలి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శన్ కౌంటర్ ఏర్పాటుకు రామమోహనరావు కృషి



గూడూరులో ఇటీవల టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో సుదర్శన్ కౌంటర్‌ను ప్రారంభించడం జరిగింది. అయితే ఈ సుదర్శన కౌంటర్ ఏర్పాటుకు గూడూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ ఛైర్మెన్, ప్రముఖ ఛార్టెర్డ్ అకౌంటెంట్ శ్రీకంటి రామమోహనరావు గట్టిగా కృషి చేశారు. గూడూరులో సుదర్శన్ కౌంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన పలుసార్లు టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన కృషి ఫలితంగానే ఈరోజు గూడూరు పట్టణ ప్రజలకే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా శ్రీవారి దర్శన టిక్కెట్లు సులభంగా దొరికే వీలు కలిగింది.

## శ్రీ షిర్డి సాయిబాబా, శ్రీ యోగాంజనేయస్వామి వార్ల

# తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



ఇందుకూరుపేట కొత్తూరులో ప్రముఖ ఆథ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతూ ప్రతినిత్యం భక్తులను ఆథ్యాత్మికానందంలో ముంచెత్తుతున్న శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామివార్ల దేవస్థానం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 29న మొదలై మే 3వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 12గంటలకు అఖండ సాయి పారాయణం జరుగుతుంది. 3వ తేదీ ఉదయం 10గంటలకు శ్రీ సాయినాథునికి కుంబాభిషేకము, మే 2వ తేదీ సాయంత్రం 4.30గంటలకు శ్రీ షిర్డిసాయినాథ, శ్రీరామ, ఆంజనేయ సపరివార దేవతల గ్రామోత్సవం జరుగుతుంది. మే 3వ తేదీ ఉదయం 10గంటలకు శ్రీ యోగాంజనేయ స్వామివారికి బ్రహ్మ కళశాభిషేకము నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవములు జరిగే 5రోజుల పాటు దేవాలయంలో విశేషపూజలు, వివిధ భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# జన్మభూమి కమిటీల పెత్తనమేంటి?


అర్హులైన నిరుపేదలకు మంజూరు చేసిన పక్కాగృహాల విషయంలో జన్మభూమి కమిటీల పెత్తనమేంటని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రశ్నించారు. ఈ నెల 7వ తేదీన నెల్లూరు 6వ డివిజన్‌లోని సత్రం బడిలో అర్హులైన వారికి పక్కాగృహాల దరఖాస్తులను, ఉచితంగా ఆన్‌లైన్ చేసిన రసీదులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇతర కేంద్రాల్లో అయితే ఒక్కో అప్లికేషన్‌కు 50రూపాయల నుండి 100రూపాయల దాకా ఖర్చవుతుందన్నారు. ఈ గృహాల మంజూరుకు కూడా జన్మభూమి కమిటీలను పెట్టి ఈ కార్యక్రమాన్ని గందరగోళం చేయడం మంచిది కాదన్నారు. డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దేవరకొండ అశోక్, వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



### ఈతపై అవగాహన కోసం

## 8కె స్విమ్!

ప్రజలలో, పిల్లల్లో ఈతపై అవగాహన కల్పించడం కోసం ఈ నెల 10వ తేదీన ఉదయం 6గంటలకు 8కె స్విమ్‌ను నిర్వహిస్తున్నట్లు పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోపూరు పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రూరల్‌లోని జొన్నవాడ వంతెన వద్ద నుండి పెన్నానదిలో ఈ 8కె స్విమ్ ప్రారంభమవుతుందని, దాదాపు 50మంది స్విమ్మర్లు అక్కడ నుండి ఈత కొడుతూ 8కిలోమీటర్ల దూరంలో వున్న పెన్న పొర్లుకట్ట వద్దకు చేరుకుంటారని ఆయన వెల్లడించారు. పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ 8కె స్విమ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల స్విమ్మర్స్ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.







# శ్రీ షిర్డి సాయిబాబా జన్మదిన, శ్రీరామనవమి మహోత్సవములు

**15-4-2016 శుక్రవారము నుండి 17-4-2016 ఆదివారము వరకు**

పై దినములలో ప్రతిరోజు
ఉదయం 7 గం॥ల నుండి శ్రీ బాబా వారికి
**మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు**
12 గంటల నుండి
**సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు**
జరుగును.

- పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/-లు చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది.
- పైరోజులలో ప్రతిరోజు నాలుగుపూటలా షిరిడీ హారతులు జరుగును.
- ప్రతిరోజు సాయంకాలం 7గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

భక్తులు తమకు తోచిన విధముగా ధనరూపములోగాని, ద్రవ్యరూపములోగాని మందిర గుమస్తా వద్ద చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది. పై కార్యక్రమములలో భక్తులందరూ పాల్గొని బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి, వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

ఇట్లు: కార్యవర్గము

**శ్రీ షిర్డి సాయిబాబా మందిరము**
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

# 'ప్రభా'తం

భారతదేశం విభిన్న రాజకీయపార్టీల సమాహారం. ప్రపంచంలోనని ఇంకే దేశంలో కూడా ఇన్ని రాజకీయపార్టీలు ఉండవు. జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, మతప్రాతిపదిక పార్టీలు, కుల పోరాట పార్టీలు, అవినీతి పార్టీలు, అవినీతి వ్యతిరేక పార్టీలు... అబ్బో ఎన్నెన్నో రకాలో! ఈ దేశంలో అధికారంపై మమకారం ఎక్కువ. ఆ అధికార సాధనకు మార్గం రాజకీయపార్టీ. కాబట్టే లెక్కలేనన్ని పార్టీలు పుట్టుకొచ్చాయి.

దేశంలోగాని, ఆయా రాష్ట్రాల్లో గాని ఎన్నికలు జరుగుతున్నాయంటే ఆ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల భవిష్యత్‌కు, గమ్యానికి పెద్ద అగ్ని పరీక్షే! ఇప్పుడు అలాంటి అగ్ని పరీక్షలే నాలుగు రాష్ట్రాల్లోనూ, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోనూ పలు రాజకీయపార్టీలు ఎదుర్కొంటున్నాయి. ప్రధాన జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు సైతం తమ భవిష్యత్‌ను పరీక్షించుకోబోతున్నాయి.

అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, పాండిచ్చేరి... అన్ని చోట్లా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలోని విభిన్న రాజకీయ పక్షాలన్నీ ఈ సమరాంగణంలో నిలిచివున్నాయి. అయితే ఇక్కడ గెలుపోటములు జాతీయ రాజకీయాల మీద ప్రభావం చూపడంగాని, కేంద్రప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా గాని చెప్పలేము. ఎందుకంటే ఐదు చోట్ల కూడా ఎన్నికలు పక్కాగా ప్రాంతీయ సమస్యల మీదే జరుగుతున్నాయి.

పశ్చిమబెంగాల్ మళ్ళీ తృణమూల్ కాంగ్రెస్‌దేనని సర్వేలన్నీ చెబుతున్నాయి. 2011 ఎన్నికల్లో కమ్యూనిస్టు కంచుకోటలను బద్దలుకొట్టి మమతా బెనర్జీ ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. పాతికేళ్ల పాటు జాతీయ కాంగ్రెస్ చేయలేని పనిని మమత చేశారు. రాష్ట్ర పరిపాలనలో ఈ ఐదేళ్ల సమర్ధవంతంగానే నెట్టుకొచ్చారు. అయితే కొన్ని లోపాలూ లేకపోలేదు. పెరిగిన ప్రతీకార హత్యలు, శారదా చిట్స్ కేసు, పలు అవినీతి ఆరోపణల్లో సొంత పార్టీ వాళ్లు చిక్కుకోవడం ఆమెకు ప్రతిబంధకాలే! అయితే ఇవేమీ ఆమె గెలుపును ఆపలేవని సర్వేలు ముందే కూసేసాయి. మమతను నిలువరించడానికి కాంగ్రెస్ వాళ్ళు కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్నా ఆ ప్రయోగం ఇక్కడ పనిచేసే అవకాశం లేదు. ఈ రాష్ట్రంలో ఓటింగ్ శాతాన్ని పెంచుకోవాలనుకుంటున్న బీజేపీ ఆశలు కూడా అంతంత మాత్రమే నెరవేరవచ్చు.

అసలైన పోరుకు వేదిక తమిళనాడు. ఇక్కడ అధికారంలో వున్న పార్టీ తిరిగి అధికారంలోకి రాదనే విశ్వాసముంది. అయితే ఈసారేమన్నా ఆ నమ్మకం వమ్మవుతుందా? అని అందరి ఆలోచన. తమిళనాడు పీఠం మళ్ళీ జయలలితదే కావచ్చు. సర్వేలే కాదు సామాన్య జనాభిప్రాయం కూడా అదే! ఈ ఐదేళ్లలో పరిపాలనా పరంగా జయలలిత అత్యంత సమర్ధవంతురాలిగా తనను తాను నిరూపించుకోగా, డిఎంకె మాత్రం కుటుంబ కలహాలతో పాటు కరుణానిధి వృద్ధాప్యం మూలంగా అంతగా పుంజుకోలేకపోయింది. డిఎంకెతో విజయ్‌కాంత్ పొత్తుపెట్టుకుని వుంటే పరిస్థితిలో కొంత మార్పు ఉండేదేమో! అన్నాడిఎంకెకు గట్టి పోటీనే వుండేది. కాని విజయ్‌కాంత్ ముఖ్యమంత్రి పీఠాన్ని డిమాండ్ చేయడం వల్ల వారి మధ్య పొత్తు కుదరలేదంటున్నారు. జయలలిత మళ్ళీ అధికారంలోకి రాగలదనడానికి బలమైన కారణాలు అక్కడ అమలు చేస్తున్న ఉచిత పథకాలే! కంప్యూటర్, ల్యాప్‌టాప్, టీవీ, మిక్సర్, గ్రైండర్, అమ్మ టిఫిన్, అమ్మ నీళ్లు... ఇంకే రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాలు లేవు. తమిళనాడులో ఫ్రీ పథకాలకు ఆదరణ ఎక్కువ. కాబట్టే ఇన్ని ఉచితంగా ఇచ్చిన 'అమ్మ'నే తమిళ జనం మళ్ళీ ఆదరించేటట్లున్నారు. ఇదే జరిగితే, తమిళనాడు రాజకీయ చరిత్రలో ఇదొక సంచలనమే! కేంద్ర పాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో మళ్ళీ రంగస్వామే రావొచ్చని తెలుస్తోంది.

తమిళనాడులో లాగే కేరళలోనూ ప్రతి ఎన్నికలకు పార్టీల మధ్య అధికార మార్పిడి జరుగుతుంటుంది. వామపక్ష కూటమి ప్రస్తుతం అధికారంలో వుంది. ఇక్కడ ఒకసారి అధికారంలోకి వచ్చిన పార్టీ ఇంకోసారి అధికారంలోకి రాదు. హిందువులు, మైనార్టీలు దాదాపు సమానంగా వుండే ఈ రాష్ట్రంలో ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్‌లు మతాలవారీగా ప్రజలను ఓటు బ్యాంకులుగా మలచుకున్నాయి. మైనార్టీలలో మెజార్టీ శాతం యూడిఎఫ్‌కు మద్దతిస్తుండగా, హిందువులలో మెజార్టీ వర్గీయులు వామపక్షాలకు అండగా నిలుస్తూ వచ్చారు.

అయితే ఇటీవలకాలంలో బీజేపీ ఇక్కడ చొచ్చుకుపోవడానికి తీవ్రంగానే ప్రయత్నాలు మొదలుపెట్టింది. దాని మాతృసంస్థ ఆరెస్సెస్ ఇందుకు పునాదులు సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరెస్సెస్ శాఖలు వెలిశాయి. కమ్యూనిస్టు మద్దతుదారు వర్గాలైన హిందువులను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేయసాగాయి. బీజేపీ బలపడితే అది తమకు ఎదురుదెబ్బేనని భావించిన కమ్యూనిస్టులు ఇటీవల ఆరెస్సెస్ వాదులపై దాడులు చేయడం ఇక్కడ ఎక్కువైంది. ఈరోజుకీరోజు ఇక్కడ బీజేపీ గణనీయంగా ప్రభావం చూపకపోవచ్చు గాని భవిష్యత్‌లో మాత్రం హిందువులంతా కూడా బీజేపీ వైపే మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అస్సాంలో పోటీ మాత్రం అధికార కాంగ్రెస్, బీజేపీల మధ్య నువ్వా - నేనా అన్నట్లుగా వుంది. సర్వేలు కూడా ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాకపోవచ్చునని చెబుతున్నాయి. ఒకప్పుడు బీజేపీ ఇక్కడ నామమాత్రంగా వుండేది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో సగం లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఆ పార్టీ అనూహ్యంగా ఎదిగింది. దీనికితోడు అస్సాంగణ పరిషత్ పార్టీతో పొత్తు వుంది. ఇక్కడ స్థానికులకు బంగ్లాదేశ్ నుండి వస్తున్న వలసవాదులకు మధ్య అంతర్గత పోరు నెలకొంది. స్థానికులు చొరబాట్లను వ్యతిరేకిస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఓట్ల కక్కుర్తితో చొరబాట్లను అడ్డుకోలేకపోతోంది. దీంతో అస్సాంలో చొరబాటుదారుల సంఖ్య పెరగడమే కాక కొన్ని ప్రాంతాల్లో వారే కీలక రాజకీయ శక్తులుగా ఎదుగుతున్నారు. చొరబాట్లను అరికట్టే పార్టీకే మద్దతునివ్వాలంటూ స్థానికులు కట్టుబడి బీజేపీకి మద్దతు పలుకుతున్నారు. ఈ ఎన్నికల్లో హంగ్ ఫలితాలొచ్చినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే మార్గాలు బీజేపీకే ఉంటాయి.

త్వరలో ఫలితాలు వస్తాయి. ఇద్దరు మహారాణులు జయలలిత, మమతలు మళ్ళీ సీఎంలు కానున్నారు, మిగిలిన మూడు రాష్ట్రాల్లో అధికారం తారుమారు కావచ్చని అంచనా!



## మినీ సంగ్రామం

అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పాండిచ్చేరి... అన్ని చోట్లా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలోని విభిన్న రాజకీయ పక్షాలన్నీ ఈ సమరాంగణంలో నిలిచివున్నాయి. అయితే ఇక్కడ గెలుపోటములు జాతీయ రాజకీయాల మీద ప్రభావం చూపడంగాని, కేంద్రప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా గాని చెప్పలేము. ఎందుకంటే ఐదు చోట్ల కూడా ఎన్నికలు పక్కాగా ప్రాంతీయ సమస్యల మీదే జరుగుతున్నాయి.

# మద్దతు ధర కల్పించండి



**- జేసీ ఇంతియాజ్**

రైతులు పండించిన ధాన్యానికి మద్దతుధర కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్ తహశీల్దార్లను ఆదేశించారు. ఆదివారం చిల్లకూరు, పెళ్ళకూరు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు సకాలంలో బిల్లులు వారి అకౌంట్లలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర జిల్లాలకు చెందిన మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసేందుకు బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చారని తెలిపారు.

## వీనుల విందుగా సోదరీమణుల గాత్ర కచ్చేరి

భిక్షాటన పూర్వక త్యాగరా స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో 51వ శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి చెన్నైకి చెందిన అనహిత, అపూర్వ సోదరీమణుల గానం వీనులవిందుగా సాగింది. వీరికి ఎస్.రవీంద్రన్ (వయొలిన్), కె.వినీత్(మృదంగం), కె.శివరామకృష్ణ(కంజర) వాయిద్య సహకారం అందించారు. స్మరణోత్సవాల్లో ఉదయం శ్రీ సీతారామ కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి స్వామివారి ఏకాంతసేవ అలంకార దర్శనం నేత్రపర్వంగా భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ కార్యక్రమాన్ని భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజస్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవిప్రసాద్ పర్యవేక్షించారు.

## నేత్రదానం



నెల్లూరు పప్పులవీధికి చెందిన దామిశెట్టి విజయలక్ష్మి(54) ఈ నెల 1వ తేదీన కనుమూసారు. వారి కుటుంబసభ్యుల సహకారంతో మాదరన్ కంటి వైద్యశాల వారు ఆమె నేత్రాలను సేకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు 'ఐ'డొనేషన్ మోటివేటర్ వై.వి.సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# ఎస్పీ విశాల్ గున్నీకి సహకరించండి




నెల్లూరుజిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఎస్పీ విశాల్‌గున్నీకి జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సహకరించాలి. జిల్లా కేంద్రమైన నెల్లూరులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటూ నేరాల నియంత్రణకు సి.సి.కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్న ఎస్పీ చొరవ అభినందనీయం. గతంలో ఎస్పీగా పనిచేసిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి లాగే జిల్లా ప్రజల అభిమానం చూరగొని పేదవారికి అండగా నిలవాలని ఎస్పీ విశాల్‌గున్నీకి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను. సామాన్య ప్రజలు సైతం తమకు న్యాయం జరిగినప్పుడు నేరుగా ఎస్పీతో మాట్లాడేందుకు ప్రతి గురువారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం చేపట్టి సామాన్యులకు అందుబాటులో వుంటున్న ఎస్పీ ఆదర్శ ప్రాయుడు.

*యస్.బాబురావు, కావలి.*

## టీమ్ స్పిరిట్ అది

టి-20 ప్రపంచకప్‌ను రెండింటిని వెస్టిండీస్ వాళ్లు కైవసం చేసుకున్నారు. కేవలం ఒక ఆటగాడి మీదే ఆధారపడకుండా సమిష్టిగా ఆడి గెలిచారు. భారత జట్టు సమిష్టిగా ఆడకపోవడం వల్లే సెమీస్ నుండి తిరుగుముఖం పట్టింది. ఆర్థికంగా స్థితిమంతులు కాకపోయినా వెస్టిండీస్ జట్టు తమ దేశం కోసం ఆడి కప్‌ను చేజిక్కించుకుంది.

*సాగర్, హైదరాబాద్.*

## విపరీత అధికారాలు లేవ్!

రోజా సస్పెన్షన్ వ్యవహారంలో సింగిల్ బెంచ్ తీర్పును కొట్టివేస్తూ 194(3) ప్రకారం శాసనసభకున్న విశేష అధికారాలను మేము త్రోసిపుచ్చలేము, శాసనసభ స్పీకర్ అధికారాలకు అడ్డుచెప్పే అధికారం మాకు లేదని హైకోర్టు ధర్మాసనం చెప్పింది. రాజ్యాంగబద్ధంగా, పక్షపాత రహితంగా ప్రజోపయోగకరమైన చట్టాలు చేసే విశేష అధికారాలు శాసనసభకు ఉన్నాయి. దానిని ఎవరూ కాదనలేరు. ప్రతిపక్షాన్ని కించపరుస్తూ, మీ కోరలు పెరికేస్తా, ఖబడ్దార్, మీకు సిగ్గుందా అంటూ ప్రతిపక్షాన్ని సంభోదిస్తూ సభ్యులను ఏడాదిపాటు లేక అసెంబ్లీ పదవీ కాలం ముగిసేవరకు సస్పెన్షన్ చేయాలనే దురుద్దేశంలో చేసే 'విపరీత అధికారాలు' అసెంబ్లీకి లేవు. అసెంబ్లీ విపరీత అధికారాలు చెలాయిస్తే న్యాయస్థానం తప్పక జోక్యం చేసుకుని అధికార దర్పానికి చెక్ పెట్టాలి.

*కురుగూరు రంగనాథం, నెల్లూరు.*

## ఫ్లైఓవర్లు ఆలోచించి వెయ్యండి

నెల్లూరులో కొండాయపాలెం గేటు, బి.వి.నగర్‌ల వద్ద రెండు ఫ్లైవోవర్ వంతెనలు మంజూరైనాయని వ్రాసారు. కొండాయపాలెం గేటు ఫ్లైవోవర్ అవసరమే. అయ్యప్పగుడి ఫ్లైవోవర్ వుండగా బి.వి.నగర్ వద్ద అవసరం లేదు. కాంట్రాక్టర్ల కోసం అనవసరమైన ఫ్లైవోవర్‌లు కట్టొద్దు. మాగుంట లే అవుట్ నుండి రంగనాయకులపేట మధ్య జనావాసాలు, వ్యాపార సంస్థలు ఎక్కువ. ఈ ప్రాంతంలో రైల్వేవోవర్ బ్రిడ్జి కట్టాల్సిన అవసరముంది.

*వాస్తు రామచంద్ర, నెల్లూరు.*



ఆహ్వానము

# శ్రీరామ నవమి సంబరాలు

## లాయర్

వారపత్రిక ఆధ్వర్యంలో

తే.15.04.2016ది శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి
నెల్లూరు ఆర్.యల్.రెడ్డి పురమందిరం(టౌన్‌హాల్) నందు
**శ్రీరామ నవమి సంబరాలు** నిర్వహించబడును.

ఈ సందర్భంగా...
భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఆలవాలమైన "వివాహ వ్యవస్థ" ప్రాశస్త్యాన్ని తెలుపుతూ
శ్రీరస్తు.. శుభమస్తు... కళ్యాణమస్తు... అంటూ లాయర్ ప్రచురించిన

## పెళ్ళిపుస్తకం

ఆవిష్కరణ

అన్యోన్య దాంపత్య జీవితంలో స్వర్ణోత్సవం జరుపుకున్న
ఆదర్శదంపతులకు వేద పండితుల ఆశీర్వచనం



మధురమైన పెళ్ళి పాటలతో
సినీ సంగీత సందడి

ఈ సంబరంలో...



**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**
శాసన మండలి సభ్యులు



**శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**
శాసనసభ్యులు, నెల్లూరు గ్రామీణం



**శ్రీమతి యం.జానకి, ఐఏఎస్**
ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా కలెక్టర్



**శ్రీ విశాల్ గున్ని, ఐపిఎస్**
నెల్లూరుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్



**శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
ప్రముఖ దాత మరియు పారిశ్రామికవేత్త



**శ్రీమతి దీపా వెంకట్**
మేనేజింగ్ ట్రస్టీ, స్వర్ణభారత్ ట్రస్ట్

ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

వేదపండితుల ఆశీర్వచనాలు అందుకోనున్న

## పుణ్యదంపతులు

శ్రీ జె.వి.రెడ్డి - శ్రీమతి జానకమ్మ
శ్రీ బెజవాడ దశరధరామిరెడ్డి - శ్రీమతి అన్నపూర్ణమ్మ
శ్రీ గ్రోసు గోపాలయ్య - శ్రీమతి శాంతమ్మ
శ్రీ కె.వి.చలమయ్య - శ్రీమతి శకుంతలమ్మ
డాక్టర్ బి.సుందరరామిరెడ్డి - శ్రీమతి అరవిందమ్మ

శ్రీ జె.కె.రెడ్డి - శ్రీమతి సులోచనమ్మ
డాక్టర్ పి.మధుసూదనశాస్త్రి - శ్రీమతి రాజ్యలక్ష్మి
శ్రీ జె.వి.నారాయణమూర్తి - శ్రీమతి భవాని
శ్రీ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి - శ్రీమతి సుజాతమ్మ
శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మ

శ్రీ కె.వి.రత్నం - శ్రీమతి పద్మావతమ్మ
శ్రీ నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచనమ్మ
శ్రీ సామంతు గోపాల్‌రెడ్డి - శ్రీమతి మధుసూదనమ్మ
శ్రీ పి.రాజగోపాల్‌రెడ్డి - శ్రీమతి ఇందిరమ్మ
శ్రీ ఎన్.వి.రమణయ్య - శ్రీమతి అనసూయమ్మ

**అందరూ ఆహ్వానితులే..**

# నెల్లూరు కబుర్లు



## బైక్‌పై ఎస్పీ

నెల్లూరు ట్రాఫిక్‌తో తాడోపేడో తేల్చుకుందామని పంతం పట్టిన జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని ఈ ట్రాఫిక్‌ను దారికి తేవడానికి ఎన్ని ఫీట్లు చేయాలో అన్నీ చేస్తున్నాడు. మనకు తెలిసి ఏఎస్పీ కూడా చేసివుండని విధంగా 5వ తేదీ మోటార్‌బైక్ ఎక్కి నెల్లూరుంతా తిరిగారు. ట్రాఫిక్ తీరుతెన్నులను పరిశీలించారు. బైక్ మీద వెనకకూర్చుని ఆయన కె.వి.ఆర్ పెట్రోల్‌బంకు నుండి ఆర్టీసీ, గాంధీబొమ్మ, నర్తకి సెంటర్‌ల మీదుగా స్టోన్‌హౌస్‌పేట వరకు వెళ్లారు. మధ్యమధ్యలో ట్రాఫిక్ రద్దీని, రోడ్డు పక్కనే ఆపుతున్న వాహనాలను, పోలీసుల పనితీరును గమనిస్తూ వెళ్లారు. స్టోన్‌హౌస్‌పేటలో ట్రాఫిక్‌ను వీడియో తీయించి, ఆ తర్వాత విజయమహల్‌గేటు, రామలింగాపురం జంక్షన్, మాగుంట లే అవుట్‌ల మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయంకు చేరుకున్నారు. ట్రాఫిక్‌ను సరిదిద్దడానికి ఆఖరకు ఎస్పీ బైక్‌ల మీద కూడా తిరుగుతున్నాడు. ఆయన శ్రమకు తగ్గట్లుగా ఈ నెల్లూరు ట్రాఫిక్ బాగుపడితే అంతే చాలు!

## అందంగా ముస్తాబైన అర్చన




మాగుంటోళ్ల హాళ్లలో ఎస్-2 తర్వాత ప్రాధాన్యత కలిగిన థియేటర్ అర్చన 70 ఎంఎం ఏసి. ఒక ప్పటి రంగమహల్, శేషమహల్‌ల ప్రాంగణంలో అర్చనను నిర్మించడం తెలిసిందే! అర్చన థియేటర్‌లో తొలి సినిమా 'అడవిసింహాలు'.. కొన్ని వందల సినిమాల ప్రదర్శకు వేదికై, ఎన్నో సినిమాల శతదినోత్సవ వేడుకల ప్రాంగణమైన అర్చనను కొన్ని నెలల క్రితం మరమ్మత్తులు కోసం మూసివేశారు. ఎంతో ఖర్చుతో అత్యాధునికంగా అర్చనను తీర్చిదిద్దారు. ఎస్-2 తరహాలోనే ఇక్కడా ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. ఏపిలోనే మొదటిసారిగా ఇక్కడ లేజర్ 2కె ప్రొజెక్టర్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీఎక్స్ సౌండ్ సిస్టం, సిల్వర్‌స్క్రీన్‌తో పాటు 779ఆకర్షణీయమైన సీట్లతో అర్చనను ముస్తాబు చేశారు. 8వ తేదీన పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'సర్దార్ గబ్బర్‌సింగ్' సినిమాతో అర్చన మళ్ళీ ప్రేక్షకులను అలరిస్తోంది.

## సిపిఎం స్కూల్‌ను కాపాడండి



వందేళ్ల చరిత్ర కలిగిన నెల్లూరు, మూలాపేటలోని సిపిఎం హైస్కూల్‌ను కబ్జాదారుల కబంధ హస్తాల నుండి కాపాడాలని కోరుతూ ఆ స్కూల్ పూర్వ విద్యార్థులు జిల్లా ఎస్పీ విశాల్ గున్నీకి వినతి పత్రం సమర్పించారు. అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ ఈ స్కూల్‌ను స్థాపించింది. వందేళ్లలో ఎంతోమంది మేధావులను అందించింది. పేద ధనిక భేదం లేకుండా అందరికీ ఉచిత విద్యనందించింది. కాని అధికారులు ఒక పథకం ప్రకారం ఈ స్కూల్‌ను మూతపడేలా చేశారు. ఈ హైస్కూల్‌ను తిరిగి ప్రారంభించి పూర్వవైభవం తీసుకురావాలని పూర్వ విద్యార్థులు ఎస్పీని ఆ వినతిపత్రంలో కోరారు.

## మహిళా న్యాయమూర్తులకు సన్మానం



నెల్లూరు నగరం నుంచి న్యాయమూర్తులుగా ఎన్నికైన ముగ్గురు మహిళా న్యాయవాదులకు గత నెల 28వ తేదీ నెల్లూరు బార్ అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కారం జరిగింది. న్యాయవాదులు పి.గాయత్రి, డి.శ్రీదేవి, శ్రీరమలకు మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ధర్మంగా, సత్యంగా, న్యాయంగా, మనస్సాక్షిగా, మనస్ఫూర్తితో తీర్పులు ఇవ్వాలని సూచించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం.బాలసుబ్రహ్మణ్యం, నావూరి శ్రీధర్, సీనియర్ న్యాయవాదులు నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పిడూరు నాగేశ్వరరావు, వై.వి.శేషయ్య, కె.వి.సురేష్, ఎం.శ్రీనివాసులు, ఇ.ఎస్.జగదీశ్వర్, పి.సి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి నిత్యాన్నదానానికి

# డాక్టర్ గోపాలకృష్ణ భూరివిరాళం



నెల్లూరు నగరంలో నేత్ర వైద్యులుగా చాలామంచి పేరు వున్న వ్యక్తి డాక్టర్ ఓ.గోపాలకృష్ణ. కళ్ళకు సంబంధించిన ఎటువంటి సమస్యలకైనా ప్రతి ఒక్కరూ ముందు ఆయన అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తారు. చెన్నై, మధురై వంటి నగరాలకు వెళ్ళే పరిస్థితులు రాకుండా ఆ స్థాయి వైద్యం అందించడంలో ఆయన సిద్ధహస్తుడు. నెల్లూరు మాదరన్ ఐ ఆసుపత్రిలో మెడికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఎస్.వి.నిత్యాన్నదాన ట్రస్టుకు 5లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ నెల 3వ తేదీన తన సతీమణి శ్రీమతి అంజని, కుమారుడు అనిరుధ్ కృష్ణలతో కలిసి తిరుమల వెళ్లిన ఆయన, అక్కడ డోనార్‌సెల్ సూపరింటెండెంట్‌కి 5లక్షల డి.డిని అందజేశారు. వైద్యవృత్తిలోనే కాదు, దైవ భక్తిలోనూ తన మనసును చాటుకున్న గోపాలకృష్ణకు 'లాయర్' అభినందనలు.

## ఆల్ట్రనేట్ డీలక్స్‌లు



డీలక్స్ బస్సులను ఆల్టర్నేట్ చేసి అల్ట్రా డీలక్స్ బస్సుల పేరుతో ఆర్టీసీ కొత్త బస్సులను ప్రవేశపెట్టింది. డీలక్స్ బస్సులో పుష్‌బ్యాక్ సౌకర్యం ఉండదు. ఈ అల్ట్రా డీలక్స్‌లలో మాత్రం సీటును వెనక్కు వాల్చుకునేందుకు వీలుగా పుష్‌బ్యాక్ సౌకర్యం కల్పించారు. ఈ మార్పులకు గాను డీలక్స్ బస్సుల్లో కంటే ఈ బస్సుల్లో 10శాతం ఛార్జీని ఎక్కువగా వసూలు చేయనున్నారు. నెల్లూరుజిల్లా నుండి తిరుపతి, కడప, విజయవాడ, శ్రీశైలం రూట్లలో వీటిని నడపనున్నారు. ఇది సక్సెస్ అయితే మరిన్ని బస్సులను పెంచే ప్లానుంది.



### జాతీయ సంగీత పోటీలకు

## విశ్వసాయి విద్యార్థిని శ్రేయ!

బాలభవన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి సంగీత పోటీలలో తమ కళాశాల విద్యార్థిని సర్వేపల్లి శ్రేయ ఎంపికైందని విశ్వసాయి కళాశాల ఛైర్మెన్ ఎన్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మే 3, 4తేదీలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె రాణిస్తే బాలశ్రీ అవార్డుకు ఎంపికవుతుందని ఆయన తెలిపారు. సంగీతంలో చిరుప్రాయంలోనే ఎన్నో విజయాలు అందుకున్న శ్రేయకు 'లాయర్' శుభాకాంక్షలు.

## సేవకు సత్కారం

### వసంతలక్ష్మికి అరుదైన అంతర్జాతీయ పురస్కారం



మానవ సమాజానికి అందిస్తున్న సేవలతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి చేసిన కృషికిగాను నెల్లూరులోని వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శ్రీమతి టి.వసంతలక్ష్మికి అరుదైన అంతర్జాతీయ పురస్కారం లభించింది. 5వ తేదీన హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ మైఖేల్ ముల్లన్స్ ఆమెకు యూఎస్ కన్సులేట్ అవార్డును అందజేశారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుడతానని ఈ సందర్భంగా వసంతలక్ష్మి పేర్కొన్నారు.

## కమనీయం... శ్రీనివాసుని కళ్యాణోత్సవం

శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు దర్గామిట్ట టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. టిటిడి వేదపండితులు వేదగిరి ఫణిశర్మ బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మాలెపాటి సుబ్బానాయుడు, భవాని, మాలెపాటి రవీంద్రనాయుడు, సుజాత, మాలెపాటి సుధాకర్‌నాయుడు, పద్మావతి దంపతులు వ్యవహరించారు. గుండాల గురవయ్య ఆలపించిన అన్నమయ్య కీర్తనలు వీనులవిందుగా సాగాయి. తెలుగుదేశంపార్టీ నాయకులు బీద రవిచంద్ర, మస్తాన్‌రావు, విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. పాల్గొన్న భక్తులకు టిటిడి శ్రీవారి దివ్య ప్రసాదం లడ్డూ, మధ్యాహ్నం భోజన ప్రసాదాలను అందజేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్, ప్రచార మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కుమ్మేస్తున్న ఎండలు

వారం క్రితం తగ్గినట్లే అనిపించిన ఎండలు మళ్ళీ కుమ్మేస్తున్నాయి. ప్రతిరోజూ ఎండ 40డిగ్రీలకు తగ్గడం లేదు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలు సినిమా చూపించనున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఎండ తీవ్రతకు తగ్గట్లే ప్రభుత్వం కరెంట్ ఛార్జీలను పెంచింది. ఏసిలు ఎక్కువగా వాడాలన్నా భయమే. ఈ ఎండాకాలాన్ని దాటుకునే సరికి ప్రతి ఇంటా కరెంట్ బిల్లులు తడిసి మోపెడవ్వడం ఖాయం.

## టిజిపి స్పెషల్ కలెక్టర్

తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్‌గా పి.మార్కండేయులు ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. పలువురు తెలుగుగంగ అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి అభినందించారు.

### రక్తదానంలో

## జాతీయ స్థాయి అవార్డు

నెల్లూరుజిల్లా చిరంజీవి యువతకు రక్తదానంలో జాతీయ స్థాయి అవార్డును అందుకుందని జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అవార్డును ఆదివారం హైదరాబాద్ లోని హోటల్ తాజ్‌కృష్ణలో జరిగిన కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, యువహీరో రామ్‌చరణ్‌తేజ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత సభ్యులు కృష్ణారెడ్డి, రవి పాల్గొన్నట్లు తెలిపారు.

### రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా

## గోవిందరెడ్డి

నెల్లూరుజిల్లా రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఓబిలి గోవిందరెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం నెల్లూరు మినీ బైపాస్‌రెడ్డిలోని మహేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన సంఘ సమావేశంలో ఉపాధ్యక్షులుగా బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్.నరసారెడ్డి, ప్రధానకార్యదర్శులుగా బెజవాడ గోవిందరెడ్డి, కోశాధికారిగా నెల్లూరు నిరంజన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


యువజన కాంగ్రెస్ నిరసన

# బాబొచ్చే... జాబ్ పోయే!

2014 ఎన్నికల్లో 'జాబు కావాలంటే... బాబు రావాలని' ప్రచారం ఊదరగొట్టారు. అనుకున్నట్లే బాబు వచ్చాడు. కొత్త జాబ్‌లు రావడం మాటేమోగాని ఉన్న ఉద్యోగాలు కూడా ఊడుతున్నాయని పిసిసి సమన్వయ కమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి ఆరోపించారు. ఉద్యోగాలపై చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రిలే దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు పెద్ద అబద్దాల పుట్టని, ఇచ్చిన మాట మీద నిలబడ్డ దాఖలాలు ఎప్పుడూ లేవన్నారు. కేతంరెడ్డి వినోద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని, నిరుద్యోగ యువతకు రెండువేల భృతి కల్పిస్తానన్న చంద్రబాబు హామీలు బూటకంగా మిగిలాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉడతా వెంకట్రావ్‌యాదవ్, రఘురాం ముదిరాజ్, టి.బాలసుధాకర్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారాలకే పరిమితమవుతున్న ప్రభుత్వం


- సిపిఎం మధు

ప్రజా సమస్యలను ప్రక్కనపెట్టి ప్రచారార్భాటాలకు తెలుగు దేశం ప్రభుత్వం పోతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరు నగరంలోని సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తొమ్మిది జిల్లాల్లో కరువు నెలకొందని, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మ హత్యలు కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులు చదివిన చదువులకు తగిన ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# లోకేష్‌ను మంత్రిగా చూడాలని వుంది

## సోమిరెడ్డి మనసులో మాట



అటు పార్టీకి ఇటు ప్రభుత్వానికి వారధిగా, కార్యకర్తలకు సారధిగా ఉంటూ ఉరకలెత్తే ఉత్సాహంతో పనిచేస్తున్న యువకెరటం నారా లోకేష్‌ను వెంటనే రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. 5వ తేదీ నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ పార్టీలో క్రియాశీలకంగా పని చేయడం మొదలుపెట్టాక పార్టీ రూపురేఖలే మారిపోయాయి. కార్యకర్తలకు ఆయన ఇస్తున్న ఉత్సాహం, ప్రోత్సాహం అద్భుతం. ఆయనలాగా కార్యకర్తల సంక్షేమం గురించి ఎవరూ ఆలోచించి ఉండరు. దేశంలోనే మొదటిసారిగా కాగితంతో పని లేకుండా 54లక్షల సభ్యత్వాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించిన ఘనత ఆయనదే! లోకేష్ సేవలు పార్టీతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు కూడా అవసరమే. కాబట్టి ఆయనను వెంటనే మంత్రివర్గంలోకి తీసుకోవాలని, ఇందుకోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమేనని సోమిరెడ్డి పేర్కొన్నారు. నదుల అనుసంధానం విషయంలో కేంద్ర మంత్రులు, తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా చంద్రబాబును మెచ్చుకున్నారని, కాని ప్రతిపక్ష నేత జగన్ మాత్రం పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టుల విషయంలో శాపనార్థాలు పెడుతున్నాడని, జగన్ వల్ల రాష్ట్రానికి మంచి జరగకపోయినా ఫర్వాలేదు గాని చెడు జరగకుంటే చాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## కోదండరామస్వామి దేవస్థానం

# ఛైర్మన్‌గా పొన్నాల



నెల్లూరురూరల్ పొట్టేపాలెంలోని చారిత్రాత్మక శ్రీ కోదండరామస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా స్థానిక తెలుగుదేశం నాయకుడు పొన్నాల రామచంద్రారెడ్డిని నియమించనున్నారు. ఈ మేరకు దేవస్థానంకు నూతన పాలకమండలిని ప్రకటించారు. ఆలయ పాలకమండలి సభ్యులుగా పొన్నాల రామచంద్రారెడ్డితో పాటు చెన్నారెడ్డి, సునీల్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాసులురెడ్డి, ఉప్పాల రామచంద్రయ్య, పాలెపు నరసమ్మల చేత ఇటీవల ఆలయంలో ఇఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. వీరు పొన్నాల రామచంద్రారెడ్డిని ఛైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. త్వరలోనే దేవస్థానం వద్ద నూతన పాలకమండలికి భారీ అభినందన సభ నిర్వహణకు ఏర్పాటు జరుగుతున్నాయి. పొన్నాల రామచంద్రారెడ్డి తొలి నుండి తెలుగుదేశంకు ఈ గ్రామంలో కీలక నాయకుడు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. ప్రభుత్వ పథకాలను గ్రామ ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో తనవంతు కృషి చేశాడు. ఈ దేవస్థానం అభివృద్ధిలోనూ ఆయన కుటుంబ సభ్యులు ఎనలేని కృషి చేశారు. ఆయన కృషికి గుర్తింపుగానే ఈ దేవస్థానం ఛైర్మన్ పదవిని ఆయనకు ఇస్తున్నారు. తన మీద నమ్మకంతో తనకు ఈ బాధ్యతను అప్పగించడానికి కృషి చేసిన తెలుగుదేశం పార్టీ నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తెలుగు దేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## అలఘునాధస్వామి
# ఆలయ ఛైర్మెన్‌గా సిద్దారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

గూడూరు పట్టణంలోని శ్రీ అలఘునాధస్వామి ఆలయ ఛైర్మెన్‌గా సిద్దారెడ్డి జనార్ధనరెడ్డి, పాలకవర్గ సభ్యులుగా బొంతల వెంకటేశ్వర్లు, జమళ్ళ రమేష్, మర్రి శ్రీనివాసులు, గుండాల భారతి, కోటా రాజేంద్రప్రసాద్, భాస్కర్ ప్రమాణస్వీకారం చేశారు. శనివారం శ్రీ అలఘునాధస్వామి దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ గూడూరు ఇన్‌ఛార్జ్ డాక్టర్ బీఆర్ జ్యోత్స్నలత కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ, మంచివ్యక్తిని ఈ ఆలయానికి ఛైర్మెన్‌గా ఎన్నుకోవడం మంచి పరిణామమని అభినందించారు. వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ, పురాతన ఆలయాలను పరిరక్షించుకుంటూ, వాటిని మన భావితరాలవారికి అందించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవూరు విజయమోహన్‌రెడ్డి, పొనకా దేవసేన, శ్రీకంటి రామమోహనరావు, కొడవలూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారు వ్యాపారుల
# ఉల్లిపాయల నిరసన



ఉల్లిపాయలు విక్రయిస్తున్న బంగారు వ్యాపారులు

కేంద్రప్రభుత్వం విధించిన అదనపు ఎక్సైజ్ పన్నుకు వ్యతిరేకంగా పట్టణంలోని బంగారు కుదువ వ్యాపారులు స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద ఇటీవల ఉల్లిపాయలు విక్రయిస్తూ తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జ్యువెలరీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య మాట్లాడుతూ, ఈ పన్ను విధానాన్ని దేశంలోని స్వర్ణవ్యాపారులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ విషయం గుర్తించి కేంద్రప్రభుత్వం ఈ అదనపు పన్నును తొలగించాలని కోరారు. ఈ పన్ను వల్ల వ్యాపారులు వీధినపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాన్‌బ్రోకర్స్, జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామ్‌ప్రసాద్, కలువా రవి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 2వ తేదీన గూడూరులోని తమ నివాసానికి విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తితో గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశం నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి మరియు వారి కుటుంబసభ్యులు

# శ్రీవారి లడ్డూ ధర పెంచే ప్రసక్తే లేదు

- టిటిడి బోర్డ్ ఛైర్మెన్ చదలవాడ వెల్లడి
- గూడూరులో సుదర్శన్ కౌంటర్ ప్రారంభం



సుదర్శన్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ప్రక్కన చదలవాడ కృష్ణమూర్తి తదితరులు

గూడూరు పట్టణంలోని నరసింగరావుపేటలో వున్న టిటిడి దేవస్థాన మండపంలో భక్తుల సౌకర్యార్థం ఈ నెల 2వ తేదీన సుదర్శన్ కౌంటర్‌ను ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదం ధరను పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గూడూరులో టిటిడి నూతన కళ్యాణమండపాన్ని నిర్మించేందుకు నిధులు కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ, గూడూరులో కౌంటర్ ఏర్పాటు కోసం పట్టణ ప్రజలు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్నారని, దీంతో వారి కల నెరవేరినట్లయిందన్నారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ, గూడూరు రైల్వే జంక్షన్ కావడంతో నిత్యం వందల సంఖ్యలో భక్తులు తిరుమలకు వెళుతుంటారన్నారు. వారికి ఈ-దర్శన్ కౌంటర్ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్ కనుమూరు హరిశ్చంద్రారెడ్డి, మాజీ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు, పొనకా శివకుమార్‌రెడ్డి, వై.గోపాల్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# జగజ్జీవన్‌రామ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గిరీషా, ప్రక్కన ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాబు జగజ్జీవన్‌రామ్ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గిరీషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ దళిత కుటుంబం నుంచి వచ్చిన మొట్టమొదటి ఉపప్రధాని అయిన గొప్పవ్యక్తి బాబు జగజ్జీవన్‌రామ్ అన్నారు. పొనకా దేవసేన మాట్లాడుతూ భావిపౌరులందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పట్టణ సిఐ సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మందా క్రిష్ణయ్య, ప్రజాసంఘాల నాయకులు ఎల్.వి.సుబ్బయ్య, దాసరి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ముత్యాలమ్మ జాతర

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో నాలుగురోజులుగా జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర 1వ తేదీతో ముగిసింది. ఉదయం పోలేరమ్మను వైభవంగా సాగనంపేందుకు కుంభం పోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని వీధుల్లో ఊరేగించారు. గురువారం రాత్రి పోలేరమ్మ, అంకమ్మ, సిద్దలయ్య, పరశురాముడు మూర్తులను ఊరేగించారు. గాండ్ల కులస్థులు పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రోజున ముత్యాలమ్మ అమ్మవారి దర్శనార్థం సమీప ప్రాంతాల నుంచి, గ్రామగ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో విచ్చేశారు. జాతర ఏర్పాట్లను ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర తదితరులు పర్యవేక్షించారు.



వెళ్లనంపు ఉత్సవంలో పోలేరమ్మ

# గుర్రాల రమణమ్మ స్మారక పురస్కారాలు



నెల్లూరులోని జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేది ఉదయం గుర్రాల రమణమ్మ స్మారక పురస్కార సభ జరిగింది. ప్రముఖ కవి గుర్రాల రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో పలువురు కవులకు, కవయిత్రులకు పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఒడియార రంగరాజ్, శిరేల సన్యాసిరావు, కెయస్వీ రమణమ్మ, మార్టూరి శ్రీరామ్‌ప్రసాద్, డా. శార్వాణి, దగ్గుపాటి రాధాకృష్ణ, దామా ప్రభాకర్, ఘాలి లలిత వున్నారు. భార్యాభర్తల అనుబంధాన్ని గురించి వక్తలు ఈ సందర్భంగా ప్రసంగించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. ప్రముఖ కవయిత్రి యద్దల లలిత సభను స్వాగతించగా, జిఆర్ ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య మాట్లాడుతూ, "నాకు తెలియదు కదా.. నువ్వు మధ్యలోనే నిద్ర మిస్తావని.. కనిపించని దారిగుండా ఆకాశానికి అకస్మాత్తుగా వెళ్ళిపోతావని.. నేననుకున్నానా?..అంటూ దివంగతురాలైన తన శ్రీమతిని తలచుకుంటూ చదివిన 'జీవన్మరణం' కవితలోని ఆర్ద్రత అందరి మనసుల్నీ కదిలించింది. ప్రముఖ కవయిత్రి యద్దల లలిత సభను స్వాగతించగా, డాక్టర్ సి.విజయలక్ష్మి, డాక్టర్ గుర్రాల మురళీధర్, సిరిమామిళ్ళ కోటేశ్వరరావు, కల్లూరు శేఖర్, ఆచార్య ఆదిత్య, వల్లకవి వెంకటసుబ్బారావు, గుర్రాల రమణమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# దుర్ముఖి సంవత్సర ఫలితములు



**జ్యోతిశ్శాస్త్రము నందు లోకవ్యవహారము కొరకు మన దేశమున చంద్ర, సూర్య, బృహస్పతి మాన ములలని మూడుగ ప్రధానముగ విభజించారు. తిరుమల గిరికి దక్షిణ ప్రాంతము సౌరమానమని, తిరుమల గిరి-వింధ్య పర్వతముల మధ్య ప్రాంత మును చాంద్రమానమని, వింధ్య పర్వతములకు ఉత్తర ప్రాంతము బార్హస్పత్య మానమని ప్రచారములో నున్నది. చాంద్ర, సౌర మానములవారికి దుర్ముఖి నామ సంవత్సరము జరుగుతుంది. బార్హస్పత్య మానము వారికి సౌమ్య నామ సంవత్సరము జరుగుతుంది.**

ప్రభవాది అరవై సంవత్సరములలో 30వది దుర్ముఖి నామ సంవత్సరము. యుగమనగా సంవత్సరము (కాలము) యుగము యొక్క ఆది అనగా ప్రారంభము, యుగాది అయినది. వ్యవహారములలో 'ఉగాది'గ పిలవబడుతున్నది. ఉగాది నాడు వారి వారి వర్ణాచారాల ప్రకారం మంగళస్నానము చేసి, దైవాన్ని చిత్తశుద్ధితో ఆరాధించి, షడ్రుచులు కల వేప ప్రసాదాన్ని స్వీకరించి, పంచాంగ విషయాన్ని తెలుసుకొనవలసి వుంటుంది. పంచాంగం ఎందుకు వినడం..తెలుసుకొనడం జరగాలంటే...

శ్రీ కళ్యాణ గుణావహం రిపుహరం
దుస్వప్న దోషాపహం
గంగాస్నాన విశేష పుణ్య ఫలదం
గోదాన తుల్యం నృణాం
ఆయుర్వృద్ధిద ముత్తమం శుభకరస్త్రం
సంతాన సంపత్ప్రదమ్
నానా కర్మ సుసాధనం సముచితాం
పంచాంగ మా కర్ణ్యతాం...

ప్రతి సంవత్సరము నవ నాయకులని, 21 మంది ఉప నాయకులని పిలవబడుతూ, గ్రహములు కాలానికి శుభాశుభ ఫలితములనిస్తాయి. చైత్ర శుక్ల పాడ్యమి వారాధిపతి రాజు, రవి మేషరాశి ప్రవేశ వారాధిపతి మంత్రి, రవి సింహరాశి ప్రవేశ వారాధిపతి సేనాధిపతి, రవి కర్కాటక సంక్రమణ ప్రవేశ వారాధిపతి సస్యాధిపతి, ధనుర్మాస ప్రవేశవారాధిపతి ధాన్యాధిపతి, మిధున సంక్రమణ ప్రవేశవారాధిపతి అర్ఘాధిపతి, ఆర్ద్రకార్తె ప్రవేశవారాధిపతి మేఘాధిపతి, తులా ప్రవేశ సమయమ వారాధిపతి రసాధిపతి, మకర ప్రవేశ వారాధిపతి నీరసాధిపతి అని నవ నాయకులు, సహాయకులైన 21 మంది ఉపనాయకులని పిలవబడుతారు. ముందుగా ఫలితాలు చూస్తే ఈ విధంగా వున్నాయి.

రాజు-శుక్రుడు; మంత్రి, సేనాధిపతి-బుధుడు, సస్యాధిపతి-శని; ధాన్యాధిపతి-శుక్రుడు, అర్ఘాధిపతి-బుధుడు, మేఘాధిపతి-బుధుడు; రసాధిపతి-చంద్రుడు; నీరసాధిపతి-శని. ఇందులో శుభులు 7గురు..పాపులు ఇద్దరు. మొత్తమ్మీద సంవత్సర అధినేతగా శని వ్యవహరిస్తారు.

**దుర్ముఖి సంవత్సర ఫలితము :**

సమ్యానుకూల వర్షాలు లేకను, ఈతిబాధలు అధికమగుట వలన పంటలు సరిగా పండవు. కొన్ని ప్రాంతములలో దుర్భిక్ష పరిస్థితులు; చోర, అగ్ని భయములు, ప్రజా సంక్షోభములు, రాజకీయ కల్లోల ములుంటాయి. దేశ తూర్పు ప్రాంతములందు పంటలు కొంత బాగుండి, దేశ పశ్చిమ ప్రాంతములందు కష్టనష్టములు అన్ని విధాల ఎక్కువగును. దేశ ఉత్తర ప్రాంతమునకు దుష్కాలము. ధరలు పెరుగును. ఆషాఢము వరకు ఎండల తీవ్రత, శ్రావణ మాస, ఆశ్వయుజ కార్తీకములందు వాయు సహిత సువృష్టి తుఫానులుండను. దేశం మొత్తమ్మీద ఏదో ఒక ప్రాంతములో అలజడులు, సంపద నష్టములుండును.

**నవనాయక ఫలితములు:**

**రాజు-శుక్రుడు :** రాజు శుక్రుడగుటలచే తటాకములు, సరస్సులు వాగులు, నదీనదాలు నిండుగా ప్రవహించును. ధాన్యజాతులు వృద్ధియగును. పండ్లు, పాల ఉత్పత్తి పెరుగును. పరిపాలన సామర్థ్యము నాయకులకు బాగుండును. ప్రజోపయోమగు నిర్ణయములను నాయకులు అమలు చేయుదురు. ఇతర దేశములతో సత్సంబంధములుండును. కాముకత్వము ఎక్కువగును.

**మంత్రి-బుధుడు :** ప్రజలు సంపాదనకు అడ్డదారులు తొక్కి ప్రయాసపడెదరు. ప్రభుత్వ సంపదను కొంత మంది ఆక్రమించుకొనడం జరుగును. ప్రజోపయోగ నిర్ణయాలు సకాలంలో తీసికొనుదురు. వాయు సహిత వర్షం (తుఫాన్లు) వుండును. విద్యారంగం, సాంకేతిక రంగం బాగా వృద్ధి చెందుతుంది. కొద్దిపాటి ఇబ్బందులు, విమర్శలుండినను ప్రభుత్వం సాఫీగా నడుచును.

**సేనాధిపతి-బుధుడు :** సైన్యము పటిష్టమగును. అధునాతన ఆయుధములు సమకూర్చుకొనదురు. తీవ్రవాదులు అణచివేయబడుదురు. నాయకులపై రాజకీయ వత్తిడులు పెరుగును. యుద్ధ పరిస్థితులుండునే గానీ యుద్ధములు జరగవు. ప్రజాసేవలో సైన్యము ప్రముఖ పాత్ర పోషించును.

**సస్యాధిపతి-శని :** నల్లటి ధాన్యములు, నల్లరేగడి భూములు ఫలించును. నువ్వులు, మినుములు, ఉలవలు, చింతపండు, పొగాకు, ఇనుము, బొగ్గు ధరలు పెరుగును. పంటలకు చీడలు అధికమగును. వరదలు అకాలవర్షాల వల్ల చేతికందివచ్చిన పంటలు నష్టమగును.

**ధాన్యాధిపతి-శుక్రుడు :** పూలు, పండ్ల జాతుల ఉత్పత్తి పెరుగును. గోధుమ, వరి ధాన్యములు, చెరకు, పెసలు, అలసందులు, శెనగలు, సజ్జ ధాన్యములు బాగా పండును. వీటి ధరలు అందుబాటులోనుండును. శుభకరములైన యజ్ఞములు, శుభకార్యములు అధికముగా నుండును. నల్లధాన్యముల ధరలు పెరుగును. పండ్ల రసాలు, శీతలపానీయముల ధరలు మారవు.

**అర్ఘాధిపతి-బుధుడు :** కంది, పెసర, వేరుశనగ, వెండి, బంగారము, ప్రత్తి, నూలు, నార, పసుపు, కలప, కాగితము, కాఫీ, టీ, దూది, షేర్ల ధరలు పెరుగును. యువకులు, యంత్రతంత్రము చేసేవారు అపమార్గముల సంచరించెదరు.

**మేఘాధిపతి-బుధుడు :** వాయు సహిత వర్షము లుండును. వడగండ్ల వానలు, తుఫాన్లు, ఇసుక తుఫాన్లు వుండును. అకాల మేఘముల వల్ల మూడు వంతుల పంటలు నష్టమగును. సముద్రమునందు ఎక్కువ వర్షములు రెండువంతులు కురియును.

**రసాధిపతి-చంద్రుడు :** పశు సంతతి వృద్ధి చెందును. పాలు ఉత్పత్తి బాగుండును. వైదిక కర్మలకు ప్రాధాన్య మధికముగా నుండును. మాదక ద్రవ్యములు, మత్తు పదార్థములు, శీతల పానీయముల వాడకం పెరుగును.

**నీరసాధిపతి-శని :** మాంసము, రాయి, కర్ర వస్తువులు, పింగాణి వస్తువులు, స్పేర్‌పార్ట్స్, లోహపాత్రలు ధరలు అందుబాటులోనుండినను గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరుగును. టెక్నాలజీకి సంబంధించిన వస్తువుల ధరలు తగ్గును. విద్యుత్ ఉత్పత్తి పెరుగును.

**వర్షలగ్న జగల్లగ్నములు :**

| | | | |
|---|---|---|---|
| ర,శు,చం | బు | | |
| కే | వర్షలగ్నము | | |
| | | | రా,గు |
| | శ,కు | | ల |

| | | | |
|---|---|---|---|
| శు | ర,బు | | చం |
| కే | జగల్లగ్నము | | |
| | | | రాగు4 |
| | ల,శ,కు | | |

వర్షలగ్న జగల్లగ్నాధిపతులు బుధ, కుజుల సమ శత్రువులగుటచే మధ్య ఫలితాలుండును. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వముల మధ్య పరిమితమగు సహాయ సహకారాలుంటాయి. ప్రభుత్వముల మధ్య తేడాలున్నా సమన్వయముతో పురోభివృద్ధి సాధించగలరు. మొదటి మూడు మాసములు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆర్థిక పరిస్థితులు ఒడుదుడుకులుగా నుండుట, అభివృద్ధికి సహకార లోపం, రాజకీయపరమైన ఇబ్బందులు, ప్రధాన నిర్ణయాలలో అసందిగ్ధత, ఆలస్యము జరుగుతుంటుంది. ఆగస్టు నుంచి ఆర్థిక పరిపుష్టియై అభివృద్ధి బాటలో సాగుతాయి. రెండు రాష్ట్రములందు పారిశ్రామికాభివృద్ధి సంప్రదాయ సహజ వనరుల సద్వినియోగముంటుంది. అనుకూలమగు పెట్టుబడులు, ఆకర్షణీయమైన ఉద్యోగ విధానములుండును. ప్రభుత్వముల పాలన అదుపులో సాగును. సంఘ వ్యతిరేకశక్తుల అణచివేత యుండును. రాజకీయ అవరోధనముల వలన ప్రభుత్వము ఇబ్బందులు పడినా, ఇబ్బందులను అధిగమించును. పాలకులకు, సైనికులకు ఇది పరీక్ష సమయమైనను సమర్థవంతముగానే పనిచేయుదురు. వస్తు నిల్వలు సమృద్ధిగా వుంటాయి. బ్యాంకులకు ప్రభుత్వమునకు ఆదాయము బాగుండును. స్టాక్ మార్కెట్లు లాభాలలో నడుచును. పర్యాటకరంగము వృద్ధి చెంది లాభదాయకముగా నుండును. వాహన ప్రయాణాలు, విమాన ప్రమాదాలు కూడా కలవు. వాహన ప్రమాదాల వల్ల జననష్టము పెరుగును. పంచాయతీ, మునిసిపల్ గృహనిర్మాణశాఖలు సమర్థవంతముగా సాగును. పాడిపరిశ్రమాభివృద్ధి, సంక్షేమ రంగము, వ్యవసాయ రంగాలకు ఎక్కువగ ప్రభుత్వము ఖర్చుపెట్టును. రక్షణ శాఖ కట్టుదిట్టముగా సమర్థవంతముగా దేశమును, ప్రజలను కాపాడును. స్వేచ్ఛా వివాహములు, స్త్రీ పురుషులందు కాముకత్వం పెరుగుతుంది. దేశ సార్వభౌమాధికారము పటిష్టముగా రక్షింపబడును. వైద్య విజ్ఞాన శాస్త్ర రంగాలలో కొత్త ఆవిష్కరణలు, వైద్య ప్రగతి బాగుండును. సాంకేతిక, అంతరిక్ష విజ్ఞాన విభాగాలు మన దేశ కీర్తిని పెంచగలవు. ప్రకృతి వైపరీత్యాలు, జన నష్టం, పంటలు సంపద నష్టము ఎక్కువగా ఈ సంవత్సరముండినను ప్రభుత్వములు సమర్థవంతముగ వాటిని ఎదుర్కొని కాపాడగలవు. ఆరోగ్య, స్త్రీ, సంక్షేమ రంగాలలో పురోగతి కలదు. తైలము సహజవాయు రంగాలలో అభివృద్ధి మరియు ధరల పెరుగుదలలుండును. గృహ నిర్మాణ రంగములందు అభివృద్ధి కలదు. దేశమునకు నాలుగు తుఫాన్ల వల్ల నష్టము కలుగగలదు. గత సంవత్సరముకంటే ధరలు పెరగగలవు.

**కృష్ణానదీ పుష్కరములు :** గురువు కన్యారాశి ప్రవేశ సమయము నుంచి 12 రోజులపాటు కృష్ణానదీ పుష్కరములు జరుగుతాయి. తేది. 11.08.2016 శ్రావణ శుక్ల అష్టమి గురువారం రాత్రి 9.28 గంటలకు గురువు కన్యారాశి యందు ప్రవేశించును. సూర్యాస్తమయానంతర సంక్రమణం కాబట్టి తేది. 12.08.2016 శుక్రవారం నుండి తేది.23.08.2016 వరకు కృష్ణా పుష్కరాలు జరుగును. నదిలో సంకల్పపూర్వకముగా స్నానమాచరించి జప తర్పణ కార్యక్రమాలు, పితృదేవతలకు పిండ ప్రదానములు చేయుట వలన పునీతులై కుటుంబ వృద్ధి పొందగలరు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

**కర్తరీ నిర్ణయము :** తేది 04.05.2016 నుంచి డొల్లు కర్తరీ ప్రారంభము తేది 11.05.2016 బుధవారం నుండి తేది 28.05.2016 వరకు నిజకర్తరి. ఈ కర్తరిలో 'మృచ్ఛిలాదారు కర్మాణి వర్జయేత్' అను ప్రమాణము వలన మట్టి, రాయి, కొయ్యతో కూడిన నిర్మాణములు పనికిరాదు

**మౌఢ్యములు :** సూర్యనకు అత్యంత సమీపమున ఏ గ్రహము వచ్చినను అస్తంగత దోషము కలుగును. శుభగ్రహములగు గురు, శుక్రులు రవి సమీపమునకు వచ్చినచో అస్తంగతులగుదురు. కాబట్టి గురు శుక్ర మౌఢ్యములుగా చెప్పబడినవి. ఏ రకములైన శుభ కార్యములు కూడా చేయరాదని ధర్మశాస్త్ర, జ్యోతిశ్శాస్త్ర ప్రమాణము. తేది. 30.04.2016 నుండి తేది 13.07.2016 వరకు శుక్ర మౌఢ్యమి. మరల తేది 20.03.2016 నుండి శుక్రమౌఢ్యమి. తేది 11.09.2016 నుండి తేది 10.10.2016 వరకు గురుమౌఢ్యమి జరుగును.

**మకర సంక్రమణం :** తేది. 14.01.2017 పుష్య బహుళ విదియ శనివారము మధ్యాహ్నము 12.48 గంటలకు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించును. దీనిని ఉత్తరాయణ పుణ్యకాలమని, సంక్రాంతి అని పిలుస్తారు.

**దక్షిణాయనగే భానౌ కలికాలే నరై: కృతమ్**
**పాపంమూర్తీ భవత్సర్వం బహిర్యాప్యుత్తరాయణే!!**

దక్షిణాయనంలో జనులు చేసిన పాపములన్ని ఘోరం రూపంలో మకర సంక్రమణం సమయంలో సూర్యాంశ గ్రహతారలు ప్రత్యక్షమగురూపమే మకర సంక్రాంతి పురుషరూపము. అందుకే పితృదేవతలను పూజిస్తారు. మకర సంక్రాంతి పురుషుల లక్షణములను పరిశీలిస్తే వర్షాలు, దొంగతనాలు, దోపిడీలు, ధరలు పెరుగుతాయి. గజవాహనం-అరణ్య జంతు నాశనం. రాక్షస నామధేయం-మద్యపానాదులందుకు ఆసక్తిగలవారి సంఖ్య పెరుగుతుంది. శనివారం-ప్రముఖుల వియోగము, బిల్వపత్ర ధారణ కుష్టు వ్యాధి నిర్మూలన, రక్త వస్త్రధారణ దుష్టనాశన, కాబట్టి ఉత్తరాయణ పుణ్యకాల సమయములో పితృదేవతలను ఆరాధించి రుణం తీర్చుకొనాలి.

**ఆర్ద్రకార్తె ప్రవేశము (తొలకరులు) :** జ్యేష్ఠ బహుళ విదియ బుధవారము తేది 22.06.2016 ఉదయం ఘ.2.57 లకు మిధున లగ్నము ఆర్ద్రకార్తె ప్రవేశము 'పూర్వాహ్ణకాలే జగతో విపత్తి:'..ఉదయం కాలము కావున వర్షాల వల్ల నష్టములు, పూరాషాఢ నక్షత్రమగుట అతివృష్టి, మిదున లగ్నమగుటచే పశు పక్ష్యాదులకు నష్టము కలుగును. విదియ తిథి అగుటచే సంతృప్తికరమగు పంట, ధరలు స్వల్పముగా తగ్గును.

**గ్రహణములు :** ఈ సంవత్సరమున మన దేశమున కనిపించు గ్రహణములు లేవు.

| | ఆదాయము | వ్యయము | రాజపూజ్యత | అవమానములు |
|---|---|---|---|---|
| మేష | 2 | 8 | 1 | 7 |
| వృషభ | 11 | 14 | 4 | 7 |
| మిధున | 14 | 11 | 7 | 7 |
| కర్కాటక | 8 | 11 | 3 | 3 |
| సింహ | 11 | 5 | 6 | 3 |
| కన్య | 14 | 11 | 2 | 6 |
| తుల | 11 | 14 | 5 | 6 |
| వృశ్చిక | 2 | 8 | 1 | 2 |
| ధను: | 5 | 14 | 4 | 2 |
| మకర | 8 | 8 | 7 | 2 |
| కుంభ | 8 | 8 | 3 | 5 |
| మీన | 5 | 14 | 6 | 5 |
| సర్వాదాయం | 99 | 126 | 49 | 55 |

# కళ్యాణ వైభవం...!



గునుపాటిపాళెం వాస్తవ్యులు దువ్వూరు మనోహర్‌రెడ్డి - శార్వాణిల కుమారుడు **దీపక్‌రెడ్డి - అభినయ** (సిటి మెడికల్స్ అధినేత సన్నపరెడ్డి వెంకటరెడ్డి మనుమరాలు, సన్నపరెడ్డి కృష్ణారెడ్డి - సుకన్యల కుమార్తె)ల పెళ్ళి మార్చి 30వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



మాజీకౌన్సిలర్ కిన్నెర కృష్ణమూర్తి - చంద్రసేనల కుమారుడు **శశిధర్ - సాయి సింధూర** (హైదరాబాద్ వాస్తవ్యులు బుసినేని శ్రీనివాసకుమార్ - సుధారాణిల కుమార్తె)ల వివాహం ఈ నెల 3వ తేదీ నాయుడుపేటలోని టిటిడి కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



హైదరాబాద్ వాస్తవ్యులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ చీఫ్ మేనేజర్ దువ్వూరు శ్రీనివాసులరెడ్డి - జయప్రదల కుమార్తె **శరణ్య - కార్తీక్‌రెడ్డి** (విశాఖ వాస్తవ్యులు బోర రామచంద్రారెడ్డి - శైలజల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 2వ తేదీ హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



## కావలి కబుర్లు

# బీజేపీ ఆవిర్భావ దినోత్సవం





భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కావలి పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ట్రంకురోడ్డులో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కందుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం చేపట్టిన అనేక పథ కాలు ప్రజల అభ్యున్నతికి దోహదం చేస్తాయన్నారు. దేశంలోని ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. అదేవిధంగా, కావలిలోని పాతవూరులో కావలి మునిసిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బిజెపి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో భరత్ కుమార్ మాట్లాడుతూ, భారతదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. బిజెపి ఆవిర్భావం నాటినుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా ప్రజల ఆశీస్సులతో నేడు దేశంలో తమ పార్టీ అగ్రగామిగా నిలిచిందని వివరించారు.

ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి సివిసి సత్యం, పట్టణ అధ్యక్షుడు వివి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణయ్య, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూఢ నమ్మకాలను విడనాడాలి

### - జెవివి పిలుపు



విద్యార్థులు చైతన్యవంతులై మూఢనమ్మకాలను విడనాడాలని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి ప్రశ్నించే తత్వంతో ఎదగాలని జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్య క్షుడు డా. బి.రవికుమార్ పిలుపు నిచ్చారు. జెవివి (జనవిజ్ఞాన వేదిక) కావలి పట్టణశాఖ ఆధ్వ ర్యంలో 'శాస్త్ర ప్రచారం' అనే కార్య క్రమంలో భాగంగా, ప్రసార శాస్త్ర సాంకేతిక ప్రచార శాఖ వారి సహకారంతో కావలిలోని గిరిజన బాలికల్లో శాస్త్రీయ దృక్పథం పట్ల అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెవివి అధ్యక్షుడు ఏ. రమణయ్య ఇంద్రజాల ప్రదర్శన చేస్తూ, ఇందులో మాయలు మంత్రాలు ఏమీ లేవని వివరించారు. సమాజంలో దొంగ బాబాలు వున్నారని, వారి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటివారి పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి ఎస్‌కె ఖాదర్‌బాషా, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, పి. జానకి, రామమోహన్, వార్డెన్ మనోజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బికి పంచాయతీరాజ్ రోడ్డు



కావలి నియోజకవర్గంలోని పంచాయతీరాజ్‌శాఖకు చెందిన నాలుగు రోడ్లను జిఓ నం.22 ప్రకారం రోడ్లు మరియు భవనాల శాఖకు బదిలీ చేయించినట్లు మాజీ ఎమ్మెల్యే, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు వెల్లడించారు. అల్లూరు మండలంలోని సింగపేట నుంచి సున్నపుబట్టీ వరకు 6 కిలోమీటర్లు, దగదర్తి మండలంలోని ఎంసి రోడ్డు నుంచి దామవరం, అనంతపురం, నారాయణపురం మీదుగా ఎంసి రోడ్డు వరకు 7.6 కిలోమీటర్లు, అల్లూరు నుంచి చింతగుంట, ఉడ్‌హౌస్‌పేట మీదుగా 6.2 కిలోమీటర్లు, కావలి మండలం ఎంసి రోడ్డు నుంచి చౌదరిపాళెం, బుడంగుంట మీదుగా ఉదయగిరి రోడ్డు వరకు 9.22 కిలోమీటర్లు మొత్తం 29.02 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బి ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన వివరించారు.




# సింహపురిలో అరుదైన శస్త్ర చికిత్స



సింహపురి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈమేరకు సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సింహపురి వైద్యులు మాట్లాడుతూ నెల్లూరుజిల్లా చిల్లకూరుకు చెందిన ఏళ్ల రాగమ్మ(56) గత మూడేళ్ళుగా తలనొప్పితో బాధపడుతుందని, మెరుగైన చికిత్స నిమిత్తం తమ ఆసుపత్రికి వచ్చిందని తెలిపారు. రాగమ్మకు వైద్య పరీక్షలు నిర్వహించగా చిన్నమెదడు, పెద్దమెదడుకు మధ్యలో ఓ గడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. అల్ట్రాసోనిక్ యాస్పరేటర్ పరికరంతో గడ్డను లోపలే కరిగించి బయటకు తీసామన్నారు. అమెరికా, జపాన్ లాంటి దేశాల్లో వినియోగించే పరికరాలతో శస్త్ర చికిత్స నిర్వహించడం రాష్ట్రంలోనే తొలిసారన్నారు. శస్త్ర చికిత్స నిపుణుడు వెంకటేశ్వర ప్రసన్న, నిపుణులు దీక్షాంతి నారాయణ్, డాక్టర్ సుజయ్ సిద్దా, డాక్టర్ సతీష్, డాక్టర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి బాలశ్రీ పోటీలకు
# నలుగురు ఎంపిక



జాతీయ స్థాయి బాలశ్రీ అవార్డుకు నెల్లూరు బాలభవన్ నుంచి వివిధ విభాగాల్లో నలుగురు ఎంపికయ్యారని బాలభవన్ డైరెక్టర్ గోవింద రాజు సుభద్రాదేవి తెలిపారు. జాతీయస్థాయి బాలశ్రీ పోటీలకు ఎంపికైన బాలబాలి కలను సోమవారం ఆమె అభినందించారు. సృజనాత్మక ప్రదర్శన(సంగీతం)లో సర్వేపల్లి శ్రేయ, సంతోష్(సైన్స్ ప్రాజెక్ట్), సయ్యద్ నవీద్‌హుస్సేన్(సైన్స్ మోడల్), థామస్(రచనలు) ఎంపికయ్యారని తెలిపారు. న్యూఢిల్లీలోని జాతీయ బాలభవన్‌లో మే నెల 3 నుంచి 5వరకు జరిగే బాలశ్రీ పోటీల్లో వీరు పాల్గొంటారని జాతీయ స్థాయిలో బాలశ్రీ అవార్డును పొందిన వారు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకుంటారని తెలిపారు.

### ట్రాఫిక్ నియంత్రణకు
## శుభమస్తు బ్యారికేడ్లు

నెల్లూరు నగరంలో అడ్డూ అదుపు లేకుండా విచ్చలవిడిగా ఉండే ట్రాఫిక్ నియంత్రణకు శుభమస్తు షాపింగ్ మాల్ నిర్వాహకులు రూ. 1.50లక్షలు ఖర్చుపెట్టి ట్రాఫిక్ పోలీసులకు 25బ్యారికేడ్లను అందించారు. ట్రాఫిక్ సిఐ ఎన్.రామారావు బుధవారం వాటిలో కొన్నింటిని నగరంలోని కొత్తహాలు సెంటర్, బోసు బొమ్మ సెంటర్‌లలో ఏర్పాటు చేశారు. ఈ బ్యారికేడ్లపై 'నో పార్కింగ్', 'నో ఎంట్రీ', 'నో యూటర్న్' వంటి సూచనలతో స్టిక్కర్లు ఉన్నాయి.

# 'లోకే' నాయకుడా?

(మొదటి పేజీ తరువాయి)

కోరికను మన్నించడం చూసాం. అక్కడ సోనియాగాంధీకి కావాల్సింది కూడా అదే! రాహుల్ ప్రతిభను పార్టీలోని మిగతా వారు గుర్తించడమే. ఇది కూడా ప్రజాస్వామ్య పద్ధతే!

ఇప్పుడు ఇలాంటి వాతావరణమే రాష్ట్ర రాజకీయాలలోనూ చోటుచేసుకుంది. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ వారసుడు లోకేష్‌కు రాజకీయాలలో పూర్తి పరిపక్వత వచ్చిందని, కాబట్టి ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవాలనే డిమాండ్లు ఆ పార్టీలోనే బాగా పెరిగాయి. కొందరైతే లోకేష్ కోసం తమ స్థానాలను వదులుకుంటామంటూ తమ త్యాగనిరతిని చాటుకుంటున్నారు. ప్రజల కోసం ఏ త్యాగంకు సిద్ధపడని వాళ్లు లోకేష్ కోసం మాత్రం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సీట్లు వదులుకుంటామంటున్నారు.

2009 ఎన్నికల నుండి లోకేష్‌కు రాజకీయ శిక్షణ మొదలైంది. ఆ ఎన్నికల్లో చంద్రబాబు చేసిన నగదుబదిలీ హామీ లోకేష్ ఆలోచనా సృష్టేనని అప్పుడు తెలుగుదేశం వర్గాలు పేర్కొనడం తెలిసిందే! అయితే ఆ రోజున్న వైయస్ గాలిలో ఈ హామీలు పనిచేయలేదు. 2014 ఎన్నికల్లో లోకేష్ బాగానే తిరిగాడు. పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ లోకేష్ ప్రాధాన్యత పెరిగిపోయింది. చంద్రబాబు కంటే కూడా లోకేషే పనులు ఎక్కువుగా జరుగుతున్నాయనే ప్రచారం వుంది. మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు కూడా లోకేష్‌తోనే ఎక్కువ టచ్‌లో వుంటున్నారు.

రాజకీయాలలో తాను చురుకుగా ఉన్నప్పుడే లోకేష్‌కు పట్టాభిషేకం పూర్తి చేయాలని చంద్రబాబు ఆలోచన. అందుకు ముందుగా మంత్రిని చేయాలనుకున్నాడు. అందుకు తన పార్టీ నాయకుల నుండే డిమాండ్ వచ్చేలా చేశాడు. ఇప్పుడు నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు లోకేష్‌ను మంత్రివర్గంలోకి తీసుకో నున్నారు. ఇదీ పక్కా ప్లాన్!

# చరిత్రను మరచిన చంద్రం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో వైకాపాను నిర్వీర్యం చేయడానికి ఆ పార్టీ ఎమ్మెల్యేలను లాక్కుంటున్నారనే ప్రచారం వుంది. రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలకు స్థానం లేదు. దేశ చరిత్రలో ఏ రాజకీయపార్టీ భూస్థాపితమైనా, దానికి ఆ పార్టీ వాళ్లే కారకులుగా ఉంటారు గాని, రాజకీయ ప్రత్యర్థుల వల్ల ఇంకో పార్టీని మూసేసిన దాఖలాలు లేవు. ఓట్లు తప్పితే సీట్లు రాజకీయపార్టీల పతనాన్ని, ప్రాభవాన్ని శాసించలేవు.

వైకాపాను నిర్వీర్యం చేస్తే ఏపిలో తనకు తిరుగుండదనుకుంటున్న చంద్రబాబు ఒకసారి చరిత్రను పరిశీలించాలి. ఆయన వున్న తెలుగుదేశమే ఉదాహరణ. 1983లో ఎలాంటి పునాదులు లేకుండానే వెలసిన తెలుగుదేశం, కాంగ్రెస్ అనే వటవృక్షాన్ని కూకటివేళ్లతో పెకలించింది. ఎంతమంది ఎమ్మెల్యేలు వెనకుండ బట్టి ఆరోజు ఎన్టీఆర్ అధికారంలోకి రాగలిగాడు? 1984లో బీజేపీకి రెండే సీట్లు... ఆ తర్వాత మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. తమిళనాడు అసెంబ్లీలో జయలలిత రెండు సీట్లతో పోరాడింది. 5ఏళ్లకే 200పైగా సీట్లతో అధికారంలోకి వచ్చింది.

ఇలాంటి చరిత్ర చాలావుంది. ఏ పార్టీ అయినా అధికారంలోకి రావాలంటే పనితీరు, ప్రజాదరణే కొలమానం. అంతేగాని ప్రతిపక్షాన్నే లేకుండా చేయాలనుకుంటే అదెప్పుడూ సాధ్యమయ్యే పని కాదు. ప్రజలు ప్రతిపక్షంగా మారకుండా చేసుకోగలిగితేనే ఏ పార్టీ అయినా అధికారంలో వుంటుంది. ప్రజల్లో ఆదరణ కోల్పోతే ఏ ప్రభుత్వానికైనా ప్రజలను మించిన ప్రతిపక్షం ఉండదు.

# దేశంలోకి పాశం

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలున్నాయి. ఆయన పార్టీ మారనున్నాడనే ప్రచారం కూడా విస్తృతంగా వచ్చింది. దీనిని ఆయన తీవ్రంగా ఖండించడమే కాక, జగన్‌తో కూడా కలిసి తాను వైసిపిని వీడేది లేదని ఇటీవలే ప్రకటించాడు కూడా! అయితే ఆయన పార్టీ మారనున్నాడనే ఊహాగానాలకు ఊతమిచ్చింది మాత్రం వైకాపా ఆవిర్భావ దినోత్సవం రోజున ఆయన చేసిన ప్రసంగమే! పార్టీలో ఎవరూ శాశ్వతం కాదని, తాను లేకపోయినా గూడూరులో వైకాపా బాధ్యతలను ఎల్లసిరి గోపాల్‌రెడ్డి చూసుకుంటారని ఆయన ఆరోజే చెప్పాడు. అప్పటికే ఊగిసలాట మొదలైందన్నమాట!

పాశం సునీల్ తెలుగుదేశంకు కొత్త కాదు. పాత కాపే! 1995లోనే తెలుగుదేశం పార్టీ నుండి గూడూరు మున్సిపల్ ఛైర్మన్‌గా విజయం సాధించాడు. సుదీర్ఘకాలం తెలుగుదేశంలో పని చేశారు. జగన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించాక ఆ పార్టీలో చేరాడు. సునీల్ చురుకుగా పని చేస్తుండడంతో గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఆయననే నియమించారు. 2014ఎన్నికల్లో గూడూరు సీటు కోసం ఇంకొందరు పోటీపడ్డప్పటికీ జగన్ మాత్రం సునీల్‌కే సీటిచ్చాడు. ప్రజల్లో వై.యస్. సానుభూతి, జగన్ పట్ల వున్న అభిమానం సునీల్‌ను గెలిపించింది.

ఈరోజు సునీల్ పార్టీ మారాడు. ఇది స్థానిక ప్రజల్లో కొంత వ్యతిరేకత పెంచే పనే! కాని ప్రజల వ్యతిరేకతను లెక్కచేయకుండా ఆయన పార్టీ మారాడంటే ఎంతో బలమైన కారణమే వుండాలి.

# ఒబామా కాళ్ళ మీద పడ్డ 'కిమ్'

శ్రీను గల్పిక

ఢిల్లీలో ప్రధాని కార్యాలయం. నరేంద్ర మోడీతో పాటు కేంద్రమంత్రులు మనోహర్ పారికర్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు, స్మృతి ఇరానిలు కూర్చునివున్నారు. సార్, పాకిస్తాన్ బృందం పఠాన్‌కోట్ సందర్శించి దర్యాప్తు చేసి వెళ్లింది. ఇంకా రిజల్ట్ తెలియలేదు. ఏమైందో ఒకసారి కనుక్కోండని మనోహర్ పారికర్ అడిగాడు మోడీని. వెంటనే మోడీ పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్‌కు ఫోన్ చేశాడు. ఆయన ఫోన్ ఎత్తాడు. మోడీ మొదట క్షేమసమాచారమడిగి, ఆ తర్వాత పఠాన్‌కోట్‌కు మీ వాళ్లు వచ్చి విచారించి వెళ్లారు, ఇంతకీ ఏం తేల్చారని అడిగాడు. అందుకు షరీఫ్.. ఆ విషయం మీదనే మా వాళ్లతో సీరియస్‌గా మాట్లాడుతున్నాను, ఒక్కొక్కరికీ ఘాటుగా వార్నింగ్ ఇస్తున్నాను. నేను కొద్దిసేపు ఆగి మీతో మాట్లాడుతాను అంటూ షరీఫ్ మోడీ చెప్పేది వినకుండానే పెట్టేశాడు. అయితే ఆ సమయంలో షరీఫ్ కనెక్షన్ కట్ చేసే ఎర్రబటన్ నొక్కకుండా అలాగే పక్కన పెట్టేయడంతో ఇవతల మోడీ బ్యాచ్‌కు అక్కడ జరిగే సంభాషణంతా వినిపించసాగింది. అవతల నుండి షరీఫ్ గొంతు బిగ్గరగా వినిపిస్తుంది. అసలు మీరు టెర్రరిస్టులేనా... లేక డూప్లికేట్‌లా... అసలు మిమ్మల్ని కాదు, మీకు ట్రైనింగ్ ఇచ్చిన వాళ్లను కొట్టాలి. మన దర్యాప్తు అధికారులు పఠాన్‌కోట్ వెళ్లి అంతా చూసొచ్చారు. పఠాన్‌కోట్ దాడిని బ్రహ్మాండంగా సక్సెస్ చేసి వుండొచ్చుంట... మనవాళ్లు అక్కడ అణువణువు పరిశీలించారు. చాలా సులభంగా లక్ష్యాన్ని పూర్తి చేసి వుండొచ్చంట... మీరెవరో చేతకాని వాళ్లను పంపించినట్లున్నారు. దాడి విఫలమైంది. ఈసారన్నా అలాంటి పొరపాట్లు జరగకుండా చూడండి... అని ఉగ్రవాద సంస్థల నాయకులకు షరీఫ్ హెచ్చరికగా చేస్తున్న మాటలు విని మన ప్రధాని, కేంద్ర మంత్రులకు కళ్లు బైర్లు కమ్మసాగాయి.

అంతలో మోడీ సెల్ మోగింది. ఫోన్ ఎత్తాడు. అవతల నుండి అమెరికా అధ్యక్షుడు ఒబామా... నమస్తే మోడీ సాబ్ అంటూ పలకరించాడు. అయితే, ఆ మాటల్లో వణుకు... భయం కనిపించింది. ఒబామా మాటల్లో ఏదో తేడాను గమనించాడు మోడీ. ఓ రకంగా ఆ మాటల్లో కనిపించని దుఃఖం కూడా వుంది. అది పసిగట్టిన మోడీ... ఒబామాజీ ఏంటి అలావున్నారు, ఏమైంది, మీరు బాగానే వున్నారు కదా అని అడిగాడు. ఏం బాగులే నా బొందలో బాగు... క్షణక్షణం భయంతో భస్తున్నాం, ఒక్కసారి మీరు అమెరికా దాకా వచ్చి వెళ్లకూడదూ అని అభ్యర్థించాడు. దానికి మోడీ... ఈ మధ్యంతా ప్రపంచం చుట్టూనే తిరుగుతున్నాను, ఓ నెలరోజుల నుండే కుదురుగా ఇండియాలో వుంటున్నాను, అప్పుడే అమెరికా అంటే మళ్లీ బాగుండదేమో అని మోడీ నసిగాడు. నా కోసం, నీ ప్రాణ మిత్రుడి కోసం ఆ మాత్రం రాలేవా అని ఒబామా నిష్ఠూరపడ్డాడు. దీంతో కాదనలేక మోడీ, అక్కడున్న కేంద్రమంత్రులు అమెరికాకు బయల్దేరారు.

★★★★★

వైట్‌హౌస్‌లో అడుగు పెట్టిన మోడీని చూడగానే ఒబామా పరుగున వచ్చి ఆలింగనం చేసుకున్నాడు. తర్వాత చేతులు పట్టుకుని వెక్కివెక్కి ఏడవసాగాడు. మోడీ అతనిని సముదాయిస్తూ.. ఏం ఒబామా, పదవీకాలం అయిపోతుందని బాధగా వుందా? ఏం చేస్తారు, మీ చట్టాలు ఆ విధంగా ఉండె, అదే మా దేశంలో అయితే చచ్చే దాకా పదవిలో వుండొచ్చున్నాడు. దానికి ఒబామా... నా బాధ, భయం పదవి గురించి కాదు, ఆ ఉత్తర కొరియా అధ్యక్షుడు 'కిమ్ జాంగ్' గురించి. మాట్లాడితే మా మీద హైడ్రోజన్ బాంబు వేస్తానంటాడు... అరగంటలో అమెరికాను బూడిద చేస్తానంటాడు... వాడి ధైర్యమేంటో నాకు అర్థం కావడం లేదు. ప్రపంచమే నన్ను చూసి భయపడుతుంటే, నేను మాత్రం వాణ్ణి చూసి భయపడుతున్నాను. నాకు వాడి భయాన్ని మీరే పోగొట్టాలి అని మొరపెట్టుకోసాగాడు. అప్పుడు వెంకయ్య కలుగజేసుకుని డోంట్‌వర్రీ ఒబామాజీ... వాడొచ్చి మీ కాళ్ల మీద పడేలా చేస్తాను, ఓకేనా అని అన్నాడు. వెంకయ్య మాటలు ఒబామాలో ఎంతో ధైర్యాన్ని తెచ్చాయి. మీరు ఆ పని చేస్తే మా దేశంలో ఓ రాష్ట్రానికి మీ పేరే పెడతాను అని ఒబామా అన్నాడు. తర్వాత మోడీ బృందం అక్కడ నుండి వచ్చేసింది.

ఓ రెండ్రోజుల తర్వాత...

వైట్‌హౌస్‌లో ఛాయ్ తాగుతూ ఒబామా కూర్చుని వున్నాడు. అప్పుడే కిమ్ జాంగ్ పరుగెత్తుకుంటూ ఒబామా కాళ్ల మీద పడి... ఒబామాజీ నన్ను మన్నించండి, ఇంకెప్పుడూ మీ జోలికి రాను, నాకు, మా దేశ ప్రజలకు ప్రాణభిక్ష పెట్టండి, పెద్దమనసుతో నా విన్నపాన్ని మన్నించండని దీనంగా అడగసాగాడు. 'కిమ్' మాటలతో ఒబామా షాక్ తిన్నాడు. అతనికేం జరిగిందో అర్థం కాలేదు. అయినా కిమ్‌ను తన కాళ్ల మీద పడేలా చేస్తానన్న వెంకయ్య మాటలు గుర్తొచ్చి... ఏదైనా ఇండియన్స్ ఇండియన్సే, ఇచ్చిన మాట మీద నిలబడతారని మనసులో అభినందించాడు.

★★★★★

వైట్‌హౌస్‌లో కిమ్‌పై విజయానికి గాను ఒబామా విందు ఏర్పాటు చేశాడు. ఇండియా నుండి మోడీ, వెంకయ్య, జైట్లీలతో పాటు నెల్లూరు మేయర్ అజీజ్, మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి. అనిల్‌కుమార్ యాదవ్, మాజీఎమ్మెల్యే, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(65+)లు హాజరయ్యారు. ఒబామా వెంకయ్య వద్దకొచ్చి... సార్, మీకు కృతజ్ఞతలు. 'కిమ్ జాంగ్' నా కాళ్ల మీద పడేలా చేశారు. అయినా, అదెలా సాధ్యమైందని అడిగాడు. అందుకు వెంకయ్య, ఇది నా ఘనత కాదు, వీళ్లందరి కృషి ఫలితం అంటూ నెల్లూరు నాయకులను చూపిస్తూ... వీరి సహకారంతో నేను ఈ పని పూర్తి చేయగలిగాను అంటూ వెంకయ్య అక్కడే వున్న ఆంధ్ర పత్రికలను చేతిలోకి తీసుకుని అందులో వున్న ఒక వార్తను ఒబామాకు చూపించాడు. 'అమెరికాకు నెల్లూరు ముదురు దోమల ఎగుమతి' అని హెడ్డింగ్... వార్త ఇలా వుంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో మరో ముందడుగు పడింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ ఇంత వరకు నెల్లూరు ముదురుదోమలను ఏ దేశానికీ ఎగుమతి చేయని ఇండియా, తొలిసారిగా ఆ నిబంధనను సడలించింది. అమెరికాకు 10టన్నుల దోమలను ఎగుమతి చేయడానికి ఒప్పందం కుదిరింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను దృష్టిలో పెట్టుకుని అమెరికా ఈ దోమలతో జీవాయుధాలను తయారు చేసే అవకాశముంది. ఒక్కసారి ఈ జీవాయుధాల దాడి జరిగితే... ఆ దేశంలో వున్నోళ్లు చచ్చినంతకాలం రోగాలతో బ్రతకాల్సిందే! అని వార్త వుంది. ఒబామా అసాంతం ఆ వార్త చదివాడు. వెంటనే వెంకయ్యతో... కిమ్ దారికి రావడానికి మీరు కారణం కాదన్నాడు... వెంకయ్య ఆశ్చర్యంగా... ఇంకెవరని ప్రశ్నించాడు. వెంటనే ఒబామా... మీ నెల్లూరు దోమలు... అంటూ నవ్వాడు. ఆ మాటకు అందరూ నవ్వేశారు.

# 15న లాయర్ పెళ్లిపుస్తకం ఆవిష్కరణ

• వేడుకగా శ్రీరామ నవమి సంబరాలు



యుగయుగాలుగా..తరతరాలుగా భారతీయ సంప్రదాయాలకు-సంస్కృతికి ఆలవాలమైన వివాహ వ్యవస్థ ప్రాశస్త్యాన్ని నేటి తరానికి కూడా మరింతగా సుబోధకం చేయాలనే సంకల్పంతో, వివాహాలకు సంబంధించిన అనేక విశిష్టమైన అంశాలతో పాటు, ఆ వేడుక నిర్వహణకు సంబంధించి కళ్యాణ మండపాలు, క్యాటరింగ్, హైర్స్ వంటి అనుబంధ రంగాల ప్రాథమిక సమాచారాన్ని కూడా జతచేసి.. అందరికీ ఉపయుక్తంగా వుండేలా లాయర్ వారపత్రిక తన అనుబంధ సంచికగా రూపొందించిన 'పెళ్లిపుస్తకం' ఆవిష్కరణకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈనెల 15న 'శ్రీరామనవమి' పర్వదినం రోజున టౌనుహాలులో సాయంత్రం 6గంటలకు ఈ ఆవిష్కరణ మహోత్సవం జరుగుతుంది. అదే సందర్భంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సంబరాలు వేడుకగా జరుగుతాయి. ఈ సంబరాల్లో శాసనమండలి సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ, ప్రముఖ దాత, పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. లాయర్ వారపత్రిక సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా, ఈ వేడుకల సందర్భంగా అన్యోన్య దాంపత్యంలో స్వర్ణోత్సవం జరుపుకున్న పలువురు ఆదర్శదంపతులకు వేదపండితుల ఆశీర్వచనాలుంటాయి. ఈ శుభ దీవెనలందుకునే పుణ్యదంపతుల్లో జెవి రెడ్డి-శ్రీమతి జానకమ్మ, బెజవాడ దశరథరామిరెడ్డి-శ్రీమతి అన్నపూర్ణమ్మ, గ్రోసు గోపాలయ్య-శ్రీమతి శాంతమ్మ, కెవి చలమయ్య-శ్రీమతి శకుంతలమ్మ, డాక్టర్ బి.సుందరరామిరెడ్డి-శ్రీమతి అరవిందమ్మ, జెకె రెడ్డి-శ్రీమతి సులోచనమ్మ, డాక్టర్ పి.మధుసూదనశాస్త్రి- శ్రీమతి రాజ్యలక్ష్మి, జెవి నారాయణమూర్తి- శ్రీమతి భవాని, వేమారెడ్డి శ్యామ్‌సుందరరెడ్డి-శ్రీమతి సుజాతమ్మ, ఆల్తూరు ఆదినారాయణరెడ్డి-శ్రీమతి సులోచనమ్మ, కెవి రత్నం-శ్రీమతి పద్మావతమ్మ, నంబూరు మోహన్‌రావు-శ్రీమతి సులోచనమ్మ, సామంతు గోపాలరెడ్డి-శ్రీమతి మధుసూదనమ్మ, పి.రాజగోపాల్‌రెడ్డి-శ్రీమతి ఇందిరమ్మ, ఎన్‌వి రమణయ్య-శ్రీమతి అనసూయమ్మ వున్నారు. అటు శ్రీరామ నవమి పర్వదినం, ఇటు వైవాహిక వ్యవస్థ వైశిష్ట్యాన్ని వివరించే 'పెళ్లిపుస్తకం' ఆవిష్కరణలను పురస్కరించుకుని, మధురాతి మధురమైన పెళ్లి పాటల గానంతో సినీ సంగీత సందడి కూడా అందరికీ వీనులవిందు చేస్తుంది. ఈ వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని, 'లాయర్' వారపత్రిక అభిమానులు, ఆత్మీయులు, పాఠకులు, ప్రకటనకర్తలు అందరూ విచ్చేసి తమ ఆశీస్సులు అందజేయాలని... నిండు మనసుతో ఆహ్వానిస్తూ.. విజ్ఞప్తి చేస్తున్నాం.

# ఆపదలో ఆదుకునే.. 'ఎపిలెప్సీ యాప్'

• మూర్ఛవ్యాధిగ్రస్తులకు ఇదో వరం
• 10న ఎస్పీ బాలూ చేతుల మీదుగా ఆవిష్కారం
• డాక్టర్ బిందుమీనన్ వెల్లడి



మూర్ఛ వ్యాధిగ్రస్తులకు అన్ని వేళలా అందదండలందించేందుకు వీలుగా ఒక అద్భుతమైన యాప్ ఆవిష్కరణకు సిద్ధమైంది. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఈ యాప్‌ను ఆవిష్కరించబోతున్నారు. నెల్లూరులోని డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో రూపొందిన ఈ 'ఎపిలెప్సీ యాప్' మూర్ఛవ్యాధిగ్రస్తులకు అన్నివేళలా ఎంతో సహాయపడుతుందని డాక్టర్ బిందుమీనన్ ఈ సందర్భంగా మంగళవారం నగరంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఎపిలెప్సీ యాప్.. మూర్ఛవ్యాధిగ్రస్తులకు గొప్ప సహాయకారిగా వుంటుందని ఆమె వివరించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో కూడా ఈ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే వీలుందని, ఆపద సమయాల్లో కూడా మూర్ఛవ్యాధిగ్రస్తులకు ఇది ఎంతో సహాయపడుతుందని ఆమె తెలిపారు. స్మార్ట్ ఫోన్ వినియోగం విస్తృతంగా వున్న నేటి ఆధునిక యుగంలో ఇలాంటి యాప్ మూర్ఛ వ్యాధిగ్రస్తులకు నిజంగా ఒక వరంలాంటిదన్నారు. మూర్ఛవ్యాధిగ్రస్తులకు అవసరమైన వైద్యచికిత్సల్లో భాగంగా రూపొందించిన ఈ యాప్ వారికి అన్ని విధాలా ఉపయోగంగా వుండేలా రూపొందించడం జరిగిందన్నారు. సాధారణంగా మూర్ఛవ్యాధిగ్రస్తులు వాడుకునే మందుల్లో ఒకరోజు టాబ్లెట్ వేసుకోవడం మర్చిపోయినా అనారోగ్యం పాలయ్యే ప్రమాదం వుందని, అందువల్ల మూర్ఛవ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వేసుకోవాల్సి వుంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.. వ్యాధిగ్రస్తులు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడకుండా ఈ యాప్ ద్వారా అప్రమత్తమయ్యేందుకు అవకాశం వుంటుందన్నారు. వైద్యశాస్త్రంలో శరవేగంగా పెరుగుతున్న అత్యంత ఆధునిక పరిజ్ఞానం సాయంతో వ్యాధిగ్రస్తులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని, తమ సొంత నిర్వహణలోనే వ్యాధిని నియంత్రించుకునేందుకు వీలుగా అందుకు అవసరమైన సమాచారమంతా ఈ యాప్‌లో వుంటుందన్నారు. వ్యాధిగ్రస్తునికి సంబంధించిన సమగ్రమైన వివరాలు, మూర్ఛ వివరాల పట్టిక, మందుల జాబితా, ఇఇజి రిపోర్ట్, మందులు వేసుకోవాల్సిన సమయం వివరాల (అలారం) తో పాటు, అప్‌లోడ్ మీడియా, ఇమేజెస్..ప్రథమ చికిత్స, వీడియో, పోస్టర్స్‌తోపాటు మూర్ఛ వ్యాధి గురించిన సమాచారం.. ఇలా అన్ని వివరాలూ ఈ ఎపిలెప్సీ యాప్‌లో సమగ్రంగా వుంటాయన్నారు. అంతేకాకుండా, ముఖ్యంగా మూర్ఛ వచ్చినప్పుడు ఆ వ్యాధిగ్రస్తునికి సంబంధించిన ముఖ్యమైన వ్యక్తిని అప్రమత్తం చేసేవిధంగా అలర్ట్ మెసేజ్‌తో పాటు ఫోన్‌కాల్ వెళ్ళడం తదితర సౌకర్యాలు కూడా వుంటాయని ఆమె వివరించారు. అందువల్ల వ్యాధిగ్రస్తునికి సకాలంలో వైద్యచికిత్సలు అందే అవకాశం వుంటుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఛైర్మెన్ నంబియార్, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిసెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




## అంగారక యాత్రలో...

# అపూర్వమైన భారత్ ప్రయోగాలు

- ప్రశంసించిన నాసా అధినేత చార్లెస్ బోల్డాన్



అంగారక గ్రహంపై పరిశోధనకు ఇప్పటిదాకా వివిధ దేశాలు 50కి పైగా ఉపగ్రహాలను పంపాయని, అయితే వీటన్నిటికంటే భారత్ చేసిన ప్రయోగం ఎంతో విశిష్టమైనదని, మొదటిసారే ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి భారత్ చరిత్ర సృష్టించిందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ-నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) అధినేత చార్లెస్ ఫ్రాంక్ బోల్డాన్ ప్రశంసించారు. బుధవారం ఆయన శ్రీహరికోటలోని రాకెట్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన అక్కడి ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. 2030 నాటికి అంగారక గ్రహంపైకి మానవులను పంపి మళ్లీ తీసుకురావాలన్నది తమ లక్ష్యమని, అందువల్ల ఈ ప్రయోగాలపై దృష్టిపెట్టిన దేశాలతో ఒప్పందం చేసుకునేందుకు తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అందుకోసం, 'అంగారక గ్రహంపైకి వెళ్లండి..అడుగుపెట్టండి..జీవించండి" అనే నినాదంతో తాను పర్యటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మంగళయాన్ తర్వాత నాసామ్యావెన్ అనే ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపిందని, ఇవి రెండూ అంగారకునిపైకి చేరుకుని బాగా పనిచేస్తున్నాయని తెలిపారు.

# డాక్టర్ శాంతకు ఎల్లాప్రగడ అవార్డు



మానవాళి మనుగడకు ఉపకరించే పలు అద్భుతమైన మందులను రూపొందించిన విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరిట యేటా అందించే అవార్డును ఈ ఏడాది ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్, మద్రాసులోని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మెన్ డాక్టర్ వి.శాంతకు ప్రదానం చేయనున్నట్లు నెల్లూరులోని డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ఫౌండేషన్ ఛైర్మెన్, ప్రముఖ శాస్త్రవేత్త డా.ఎ. జగదీష్ తెలియజేశారు. ఈ నెల 16న కాని, లేదా 17వ తేదిన గాని వెంకటాచలంలోని స్వర్ణభారత్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును డాక్టర్ వి.శాంతకు ప్రదానం చేస్తారని ఆయన పేర్కొన్నారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com